J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 28.08.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 13 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# కాంగ్రెస్‌కి 'కరోనా'

## 6 నెలల క్వారంటైన్



**సీనియర్ల తిరుగుబాటు**
**తల్లీ కొడుకుల ఉలికిపాటు**
**ప్రస్తుతానికి సర్దుబాటు**

***135** సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన కాంగ్రెస్‌పార్టీకి జాతీయస్థాయిలో 'అసమ్మతి కరోనా' బలంగా సోకింది. పార్టీ పెద్దలంతా సమావేశమై దీనిని 6 నెలలు క్వారంటైన్‌లో వుంచాలని తీర్మానిస్తూ అసమ్మతిని తాత్కాలికంగా అటకెక్కించారు.*

తరం తరువాతి తరం... నిరంతరం కాంగ్రెస్‌పార్టీని గాంధీ కుటుంబ వారసుల ఆధీనంలోనే ఉంచడాన్ని కొందరు సీనియర్ నాయకులు వ్యతిరేకించారు. అధ్యక్ష్య పదవిని గాంధీ కుటుంబేతరులకు ఇవ్వాలని ఒక లేఖ రాసి ఆ లేఖను వాళ్ళే లీక్ చేశారు. ఈ పరిణామాలతో యువరాజు రాహుల్ ఆగ్రహించాడు, పార్టీ అధ్యక్షురాలు సోనియమ్మ అలిగింది. హుటాహుటిన ఆమె అధ్యక్షతన ఆమే సిడబ్ల్యూసి సమావేశం పెట్టి అధ్యక్ష పదవికి రాజీనామాచేసి తనకు తానే (మిగతా 11వ పేజీలో)

# అవినీతి అంతు చూద్దాం!

## వై.యస్ జగన్ పిలుపు



**ఇది జరిగేనా..?**
**ఈ జాడ్యం వదిలేనా?**
**ఈ వ్యవస్థ మారేనా?**

***అ**వినీతి.... ఇది కరోనా కంటే వేగంగా విస్తరిస్తున్న మాయరోగం. ఎయిడ్స్ కంటే ప్రమాదకరమైన మందులేని జబ్బు. కలియుగం అవతరించినప్పటినుండి కొనసాగుతున్న ఆనవాయితీ. అవినీతిని అడ్డుకోవడం, అదుపు చేయడం అన్నది అసాధ్యమైన పని. అవినీతికి పాల్పడేవాడికన్నా ప్రోత్సహించే వాడిలో మార్పు వస్తేనే ఇది సాధ్యం. ఇది యావత్ ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న జాడ్యం. ఇప్పుడు ఆ జాఢ్యాన్ని తరిమికొడతానంటున్నాడు ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. ఆంధ్రాలో అవినీతి జాడే లేకుండా చేస్తాననీ, యాసిడ్‌తో తుడిచినా మాసిపోని ఈ మకిలిని కడిగేస్తానని అంటున్నాడీ యువ నాయకుడు.*

సుపరిపాలన సాగాలంటే ముఖ్యంగా అవినీతి రహిత వ్యవస్తే ముఖ్యం. కానీ, ఏళ్ళ తరబడిగానే కాదు, తరతరాలుగా మన దేశంలో ఈ అవినీతి జాఢ్యం అంటుకట్టుకుని వస్తూనే ఉంది. అన్ని వర్గాలు, అంతటా సర్వేసర్వత్రా అవినీతే అనాదిగా విస్తరిస్తూనే ఉంది. (మిగతా 11వ పేజీలో)



## డిఆర్‌డిఓ ఛైర్మెన్‌గా మరో రెండేళ్ళు


# మన సతీష్‌రెడ్డి

**చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు ఊతంగా రక్షణ వ్యవస్థ కోసం 108 కొత్త పరికరాలను ప్రైవేటు రంగంలో తయారుచేయడానికి ప్రతిపాదించిన మహిమలూరు మేధావి.**

రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) ఛైర్మన్‌గా మన సతీష్‌రెడ్డి పదవీ కాలాన్ని కేంద్రం (మిగతా 11వ పేజీలో)

## శ్రమిస్తున్న వైద్యులు... ఫలిస్తున్న పూజలు..

# కోలుకుంటున్న బాలు



**భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి చొరవతో ప్రత్యేక వైద్య పరికరాలను అపోలో నుండి యంజియం ఆసుపత్రికి తరలిస్తున్నారు.**

**భా**రతీయ సినిమా గాయకుడు, ఆబాల గోపాలాన్ని తన సంగీతంతో ఆకట్టుకున్న సంగీత సామ్రాజ్ఞుడు, దాదాపుగా భారతదేశంలోని (మిగతా 11వ పేజీలో)



# భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమ అభివృద్ధికి కృషిచేస్తా

## - ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి



దక్షిణ భారతదేశంలో ప్రసిద్ది చెందిన వెంకటాచలం మండలం గొలగమూడి గ్రామంలో కొలువైవున్న భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమం అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని సర్వేపల్లి ఎమ్మెల్యే, వైయస్సార్సీపి నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఈనెల 24 వెంకయ్యస్వామికి ఎమ్మెల్యే కాకాణి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి ఆరాధనోత్సవాలను రద్దుచేసినా, స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించే సంప్రదాయాన్ని కొనసాగించి తనకు అవకాశం కల్పించడం చాలా సంతోషం కలిగిస్తోందని, ఇప్పటికి ఏడుసార్లు తాము వెంకయ్యస్వామికి పట్టువస్త్రాలను సమర్పించడం తమ పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి వెంకయ్యస్వామి దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని తాను కోరుకుంటున్నానన్నారు. కరోనా వైరస్ నుంచి బయటపడి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని తాను ప్రార్థించానని ఆయన తెలిపారు. తొలుత గొలగమూడి ఆశ్రమ కార్యనిర్వహణాధికారి పి.బాలసుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కాకాణిని స్వాగతించారు. శ్రీ వెంకయ్యస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. వైయస్సార్సీపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి కట్టంరెడ్డి విజయమోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటిసి మందల వెంకటశేషయ్య, నాయకులు నంబూరి రాజానాయుడు, అలగల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


### వచ్చే నెల 9, 10 తేదీల్లో

# వెంకటగిరి పోలేరమ్మ జాతర

## నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లు



కరోనా నేపథ్యంలో జిల్లాలో ఎంతో ప్రసిద్ధమైన వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర జరుగుతుందో లేదోనని అందరూ ఉత్కంఠతో చర్చించుకుంటున్న వేళ ప్రజా ప్రతినిధులు, వెంకటగిరి రాజా కుటుంబీలు అందరూ కలసి ఎట్టకేలకు జాతర నిర్వహించడానికే నిర్ణయించుకున్నారు. కరోనా నిబంధనలకు అనుగుణంగానే జాతర నిర్వహణకు సమా యత్తమవుతున్నారు. దీంతో ఈనెల 26న బుధవారం అర్ధరాత్రి సంప్రదాయం ప్రకారం జాతరలో ప్రధాన ఘట్టంగా తొలి చాటింపు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత కాంపాళెంలోని గాలిగంగుల ఆలయం వద్ద పూజలు చేసి, ఆ తర్వాత పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. కోవిడ్ నిబంధనలతో నిరాడంబరంగానే ఈ కార్యక్రమాలన్నీ జరిగాయి. ఈ సందర్భంగా వెంకటగిరి రాజ కుటుంబీకుడు విబి సాయి కృష్ణయాచేంద్ర మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో.. తొలుత పోలేరమ్మ అమ్మవారి జాతర నిర్వహణపై సందిగ్ధం నెలకొందని, ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి ఈ విషయంలో ఎంతో చొరవ తీసుకుని జిల్లా ఉన్నతాధి కారులతో మాట్లాడి, కరోనా నిబంధనలకు అనుగుణంగానే జాతర నిర్వహించేందుకు అనుమతిని ఇప్పించడం ఎంతో సంతోషకరమని అన్నారు. ప్రజలు ఈ పరిస్థితులను అర్థం చేసుకుని సహకరించాలని ఆయన కోరారు. కరోనా నిబంధనలను అతిక్ర మించకుండా సంప్రదాయబద్ధంగా జాతర కార్యక్రమాలు నిర్వహిస్తామని, వచ్చే నెల 6న ఘటోత్సవం, 9,10 తేదీల్లో జాతర జరుగుతాయని తెలిపారు.



## రైతులను ఆదుకుంటాం

### - డిసిసిబి ఛైర్మెన్ ఆనం విజయ

జిల్లాలోని రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సిద్ధంగా ఉందని, రైతలకు అవసరమైన రుణసదుపాయాలు కలుగజేసి వారి ఆర్థికాభ్యున్నతికి కృషిచేస్తామని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి అన్నారు. కావలిలోని కావలి–ఉదయగిరి రోడ్డులో ఉన్న సహకార బ్యాంక్‌ను ఈనెల 24న ఆయన పరిశీలించిన సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి రైతుల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. అనంతరం ఈ బ్యాంక్ పరిధిలోని పలు సొసైటీల అధ్యక్షులతో ఆయన సమావేశం నిర్వహించారు. కావలి బ్యాంక్ పనితీరు పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లాలోని సహకార బ్యాంకుల అభివృద్ధికి, సొసైటీల పరిపుష్టికి, రైతన్నల సంక్షేమానికి అందరం కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

### సచివాలయ పోస్టులకు..

## 20 నుంచి రాతపరీక్షలు

జిల్లాలో ఖాళీగా ఉన్న 1550 గ్రామ సచివాలయ పోస్టులను భర్తీ చేసేందుకు సెప్టెంబరు 20వ తేది నుంచి రాతపరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తులు చేసుకున్న 56 వేల మందికి పరీక్షలు నిర్వహించే విషయమై అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఈనెల 26న తగు సూచనలిచ్చారు.

## స్వచ్ఛత - శుభ్రతలో...
# ప్రథమస్థానంలో ఆత్మకూరు

### 'స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు'ను ప్రకటించి అభినందించిన కేంద్రం

జిల్లాలోని ఆత్మకూరు మునిసిపాలిటీకి కేంద్రప్రభుత్వం నుంచి ఎంతో ప్రతిష్టాత్మకమైన 'స్వచ్ఛ సర్వేక్షణ్-2020 అవార్డు' లభించింది. ఆగస్టు 20వ తేదిన ఈ అవార్డును కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి హరిదీప్‌సింగ్‌పూరి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ అవార్డును ప్రకటించడంతో ఆత్మకూరులోనే కాక, జిల్లా వాసులంతా సంతోషం వ్యక్తం చేశారు. పట్టణాల్లో స్వచ్ఛతను పెంపొందించే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా 2016లో ర్యాంకింగ్ ప్రక్రియను ప్రారంభించింది. పారిశుద్ధ్యం, పట్టణంలో అభివృద్ధి, రోడ్ల శుభ్రత, కూరగాయల మార్కెట్ల నిర్వహణ, మరుగుదొడ్ల నిర్మాణం-నిర్వహణ, పాఠశాలల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో కేంద్రప్రభుత్వ బృందం సర్వే నిర్వహించింది. తాజాగా 2020 సంవత్సరానికి సంబంధించి దేశ వ్యాప్తంగా 4242 పట్టణాల్లో కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా సమాచారం సేకరించి జనాభా ప్రాతిపదికన 6 కేటగిరీల్లో ర్యాంక్‌లు ప్రకటించింది. ఇందులో 25వేల నుంచి 50వేల లోపు జనాభా కలిగిన మునిసిపాలిటీల్లో 'సెల్ఫ్ సస్టయినబుల్ సిటీ'గా ఆత్మకూరు మునిసిపాలిటీ సౌత్ రీజియన్‌లోనే అగ్రభాగాన నిలిచి అందరి అభినందనలు అందుకోవడం విశేషం. ఈ సందర్భంగా కేంద్రమంత్రితో పాటు కేంద్రపట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి దుర్గాశంకర్ మిశ్రా ఆత్మకూరు మునిసిపల్ కమిషనర్ రమేష్‌ను, ఆత్మకూరు ఆర్డీఓ ఉమాదేవిలను ప్రత్యేకంగా అభినందించారు కూడా. 2016-17లో సౌత్‌జోన్ స్థాయిలో 54వ స్థానం, జాతీయస్థాయిలో 193వ స్థానం సాధించగా, ఈసారి ఏకంగా ప్రథమ స్థానం సాధించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

స్వచ్ఛత, పరిశుభ్రత పాటిస్తున్న పట్టణాల్లో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఆత్మకూరు ఉత్తమ ర్యాంకు సాధించడం పట్ల రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. వరుసగా మూడవసారి కేంద్రప్రభుత్వం నుంచి అవార్డులు సాధించడం ఎంతో అభినందనీయమని ఆయన సంబంధిత అధికారుల పనితీరును కొనియాడారు.

## రాజధాని తరలింపుపై సెప్టెంబర్ 21 వరకు
# యధాస్థితి కొనసాగించండి
### - హైకోర్టు ఆదేశం

***రాజధాని తరలింపు, సీఆర్‌డీఏ చట్టం రద్దుపై కొనసాగుతోన్న స్టేటస్కోను హైకోర్టు వచ్చే నెల 21 వరకు కొనసాగించింది. 27వ తేదీ గురువారం దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్ ఈలోపు వాటికి సంబంధించి అఫిడవిట్లను దాఖలు చేయాలని ఆదేశించింది.***

వాస్తవానికి ఈ స్టేటస్కోని ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంని ఆశ్రయిస్తే... హైకోర్టులో విచారణ జరుగుతోన్న సమయంలో జోక్యం చేసుకోలేమని 26వతేదీ బుధవారం నాడు సుప్రీం స్పష్టంచేసింది. త్వరితగతిన హైకోర్టు ఈ విచారణ పూర్తి చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో రాజధాని అంశాలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై గురువారం నాడు హైకోర్టులో విచారణ జరిగింది. వచ్చే నెల 21 నుంచి రోజువారీ విచారణపై న్యాయవాదులతో ధర్మాసనం చర్చించింది. భౌతిక దూరం పాటిస్తే హైకోర్టులోనే విచారణ జరిపేందుకు సిద్ధమని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. రాజధాని, సీఆర్డీఏ చట్టం రద్దుపై గతంలో హైకోర్టు ఇచ్చిన స్టేటస్కో ఉత్తర్వులు గురువారంతో ముగిశాయి. దీంతో సెప్టెంబరు21 వరకు స్టేటస్కో అమలు గడువును పొడిగిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. రాజధాని బిల్లులు అమలు చేయకుండా స్టేటస్కో కొనసాగుతుందని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణ సెప్టెంబరు 21కి వాయిదా వేసింది.

#### కోర్టుల్లో చుక్కెదురు

మరోవైపు రమేష్ ఆసుపత్రికి సంబంధించి స్వర్ణ ప్యాలెస్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ఎఫ్ఐఆర్ నమోదుకు హైకోర్టు స్టే ఇవ్వడం, ఆసుపత్రి ఛైర్మెన్ తదితరులపై చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం కూడా ఇప్పుడు చర్చనీయాంశమైంది.

# అయ్యా జిల్లా మంత్రులూ!.. ఈ పేర్లు మార్చండి!

- మెడికల్ కాలేజీకి 'దొడ్ల సుబ్బారెడ్డి' పేరు పెట్టండి
- యూనివర్సిటీకి 'మహాకవి తిక్కన విశ్వవిద్యాలయం'గా నామకరణం చెయ్యండి!

పబ్లిక్ డిమాండ్

ఎందరో త్యాగధనులు, స్వాతంత్ర్య సమరయోధులు, దానధౌరేయులు, మేధావులకు జన్మనిచ్చిన పుణ్యభూమి నెల్లూరు. రాజుల కాలంనుండి ఈనాటి వరకు ఎన్నోతరాలు నెల్లూరు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశాయి. అయితే నెల్లూరు నగరంలో వెలసిన.. వెలుస్తున్న అనేక సంస్థలకు ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తి పేరే పెట్టడం ఇప్పుడు చాలామందిలో అసంతృప్తి రేపుతోంది. ముఖ్యంగా వందల ఎకరాల సొంత భూమిని ప్రజాప్రయోజనాల కోసం ధారాదత్తం చేసిన వారి పేర్లు కూడా భావితరాలు మర్చిపోయేలా నేతలు ప్రవర్తిస్తున్న తీరు విమర్శలకు దారితీస్తోంది.

నెల్లూరులో ఏసి సుబ్బారెడ్డి స్టేడియం, ఏసి సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్టు, ఏసి సుబ్బారెడ్డి పార్కు(వన విహార్), ఏసి నగర్, ఏసి స్థూపం, ఏసి సెంటర్, ఏసి సుబ్బారెడ్డి మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ అంటూ ఇలా అనేక దగ్గర్ల ఆయన పేరు వుంది. గత దశాబ్దాల కాలంగా ఆ పేరు ఒక పేటెంట్ హక్కులాగా అన్ని దగ్గర్లా పెడుతూనే వస్తున్నారు. ఆదిత్యనగర్‌లో జన్మభూమి పథకంలో భాగంగా జెయస్ రెడ్డి సహకారంతో నిర్మించిన చిన్నపిల్లల పార్కుకు కూడా అదే పేరు పెట్టాలని అప్పట్లో ఆనం కుటుంబ సభ్యులు కోరడంతో అందుకు జె ఎస్ రెడ్డి అంగీకరించలేదు. తిక్కన పార్కు అని పేరు పెట్టాలని జెయస్ సూచించడంతో ఇష్టపడక పోగా, కక్ష గట్టి మరీ ఇప్పటికీ ఆ పార్కుకు ఎలాంటి పేరు లేకుండా చేసిన ఘనత ఆనం వాళ్ళది.




### మెడికల్ కాలేజీ పేరు మార్చాలి...

దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి పుణ్యమా అని నెల్లూరుకు ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరయ్యింది. అది ఆనం సోదరులు తమ ఖాతాలో వేసేసుకుని ఆ కాలేజీ తాము సాధించాము కాబట్టి ఏసి సుబ్బారెడ్డి పేరును ఖాయం చేసేసి అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి చేత మమ అనిపించేశారు. అప్పట్లో చాలామంది ఈ పేరును వ్యతిరేకించారు కూడా.

ఈ వివాదం అప్పటినుండి నలుగుతూనే వుంది. కేవలం మెడికల్ కాలేజీ కోసమే ఎంతో ముందుచూపుతో 100 ఎకరాల తమ భూమిని ప్రభుత్వానికి ఇచ్చిన దొడ్ల సుబ్బారెడ్డి పేరును విస్మరించి ఏసి సుబ్బారెడ్డి పేరు పెట్టడం అన్యాయమని చాలామంది తమ నిరసన గళం వినిపించారు. కానీ అప్పుడు పెత్తనం ఆనం వాళ్ళ చేతిలో ఉండడంతో వ్యతిరేకించిన వాళ్ళ ప్రయత్నాలు ఫలించలేదు. ఇన్నాళ్లకు ఆ డిమాండ్ మళ్ళీ తెరపైకి వచ్చింది. ఏ సి సుబ్బారెడ్డిని మేము కించపరచడం లేదు. ఆయన గొప్పోడు, మహానుభావుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయ ఘనాపాటి, నెల్లూరుకు ఏంతో సేవచేసిన యుగపురుషుడు. ఆలా అని నెల్లూరంతా ఆయన మయం చేసి మిగిలిన వాళ్ళని తక్కువ చేసి అవమాన పరచడం భావ్యం కాదన్నది నెల్లూరీయుల వాదన.

నెల్లూరు ఒక కుటుంబ సొత్తు కాదు, చరిత్ర ఒకే కుటుంబానికి సొంతం కారాదు. ఎందరో పుణ్యాత్ములు జన్మించిన ధన్యభూమి నెల్లూరు. బెజవాడ రామచంద్రారెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య, తిక్కవరపు రామిరెడ్డి, పొణకా కనకమ్మ, పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి, రేబాల లక్ష్మీనరసారెడ్డి, దొడ్లసుబ్బారెడ్డి... ఇలా చెప్పుకుంటూ వెళ్తే గొప్పోళ్ళకి, దానవీరులకి నెల్లూరులో కొదవే లేదు. వీళ్లందరినీ గాలికి వదిలేసి ఒకే వ్యక్తి పేరు ఇన్ని దగ్గర్ల పెట్టడాన్ని నిన్నటి తరంతో పాటు నేటి తరం యువత కూడా వ్యతిరేకిస్తోంది.

### యూనివర్సిటీకి మహాకవి తిక్కన పేరు పెట్టాలి...

నెల్లూరును పాత రోజుల్లో సింహపురి అనే వాళ్ళు. అయితే ఆ పేరు నెల్లూరుకు ఎప్పుడు పెద్దగా కలసి రాలేదు. సింహపురి పేరుతో పెట్టిన సంస్థలు పెద్దగా రాణించలేదు. ఎక్కడో ఒకటో రెండో తప్ప మిగిలినవన్నీ మూతబడ్డాయి. అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సింహపురి హోటల్ మూతబడిపోయింది. సింహపురి పత్రిక కాలగర్భంలో కలిసిపోయింది. సింహపురి పేరుతో ప్రారంభించిన కళా సంస్థలేవీ ఎదగలేదు. ప్రారంభించిన రోజు నుండి విశేష ఆదరణ పొందిన సింహపురి హాస్పిటల్ వివాదాల్లో చిక్కుకుని ఇప్పుడు మెడికవర్ ఆసుపత్రిగా అవతరించింది. ఇలా చాలా



సంస్థలు వ్యాపారాలు ఆ పేరుతో ప్రారంభించబడి కాలగమనంలో కలిసిపోయాయి. ఇప్పుడు సింహపురి యూనివర్సిటీ కూడా అనుకున్న స్థాయిలో అభివృద్ధిని సాధించడంలేదు. సింహపురి పేరు ఈ విశ్వవిద్యాలయానికి పెద్దగా అచ్చి రాలేదన్నది నెల్లూరీయుల అభిప్రాయం.

మహాభారతాన్ని తెలుగులోకి అత్యద్భుతంగా అనువదించి, ప్రపంచ సాహిత్య రంగంలో తెలుగు భాష ఉన్నంతవరకు తన పేరు మారుమ్రోగేలా రచించి, నెల్లూరు సాహితీ గుబాళింపులను విశ్వవ్యాప్తం చేసిన మహాకవి తిక్కనకు జిల్లాలో కాదు కదా కనీసం నెల్లూరు నగరంలో కూడా ఎక్కడా ఒక్క స్మారక నిర్మాణం కూడా లేదు. తిక్కన వంటి మహానుభావుడిని చరిత్రలో కలిపేసి ఇలా తమ సొంత డబ్బాను కొట్టుకోవడానికే నేతలు ప్రాధాన్యత ఇవ్వడం క్షమించరాని నేరం. ఈ తరం నేతలైనా మేల్కొని తిక్కన వంటి మహనీయుని పేరును యూనివర్సిటీకి పెట్టిస్తే బాగుంటుందని నెల్లూరుప్రజల కోరికే కాదు డిమాండ్ కూడా. మెడికల్ కాలేజీకి, యూనివర్సిటీకి రెండిటికీ పేర్లుమార్చే ప్రయత్నానికి యువ నాయకులు అనిల్‌కుమార్‌యాదవ్, మేకపాటి గౌతంరెడ్డిలతోపాటు ఇతర యంఎల్ఏలు, యంపీలు, రాజ్యసభ సభ్యులు శ్రీకారం చుట్టి పేర్లు మార్పు చేయగలిగితే వారి పేర్లతో పాటు వీరి పేర్లు కూడా జిల్లా చరిత్రలో చిరస్థాయిగా నిలబడిపోతాయనడానికి సందేహం అక్కరలేదు.

**- సంచారి.**

# జమ్మూలో శ్రీవారి ఆలయం
### స్థలాన్ని పరిశీలించిన వై.వి.సుబ్బారెడ్డి



జమ్మూ కాశ్మీర్‌లో టిటిడి నిర్మించ తలపెట్టిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భూమి కేటాయిస్తామని జమ్మూ ప్రభుత్వం ముందుకు రావడం, ఆ ప్రతిపాదనకి టిటిడి పాలకమండలి ఆమోదం తెలపడం మనకు తెలిసిందే! ఈ నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానముల ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి 26వ తేదీ బుధవారం జమ్మూ వెళ్ళి జమ్మూ రాష్ట్ర ప్రభుత్వం ఆలయ నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించాడు. టిటిడి ఇంజనీరింగ్ అధికారులను పంపి ఈ స్థలంలో ఆలయ నిర్మాణానికి సాధ్యాసాధ్యాల పట్ల నివేదిక తెప్పించుకుంటామని అక్కడి అధికారులకు వైవి సుబ్బారెడ్డి తెలిపాడు. సుబ్బారెడ్డితో పాటు జమ్మూ కలెక్టర్ శ్రీమతి సుష్మా చౌహాన్, శ్రీ వైష్ణో దేవి ఆలయ బోర్డు సిఇఓ రమేష్‌కుమార్ తదితరులు ఈ స్థలాన్ని పరిశీలించారు.

## 'ప్రభా'తం

# సరస్వతీ విలాపం

కరోనా ప్రభావంతో ఇప్పటికే దేశంలో ఉన్న దాదాపు 15 లక్షల పాఠశాలల దాకా మూతపడిపోవడంతో, సుమారు 26 కోట్ల మందికి పైగానే విద్యార్థులు చదువులకు దూరమయ్యారని ఒక అంచనా. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు అందరికీ కనిపిస్తున్న ఒకే ఒక్క తరుణోపాయం..ఆన్‌లైన్ చదువులే. సాంకేతికపరంగా ఎంత కష్టమైనా సరే ఆన్‌లైన్‌లోనే పాఠాలు చెప్పేందుకు ఉపాధ్యాయులు, నేర్చుకునేందుకు విద్యార్థులంతా సమాయత్తం కావాల్సిందే తప్ప మరో మార్గాంతరం లేదు.



ఈ మాయదారి కరోనా ఎప్పుడు నాశనమవుతుందో తెలియదు కానీ, పసిబిడ్డల దగ్గర నుంచి యువతీ యువకుల వరకు దేశంలో కోట్లాది మంది విద్యార్థుల చదువుల పరిస్థితి అంతా అస్తవ్యస్తంగా మారిపోయింది. దేశంలో అన్ని రంగాలు కుదేలైపోయాయి. ప్రజా జీవనం స్తంభించిపోయింది. అందులో ఎంతో ముఖ్యమైన విద్యారంగం చతికిలపడడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పడే వేదన అంతా ఇంతా కాదు. చదువుల తల్లి సరస్వతి కూడా తమ బిడ్డల దుస్థితిని చూసి దీనంగా విలపిస్తోంది. బడులు మూతపడడంతో చదువుకునేందుకు తద్వారా మంచి భవితను సాధించుకునేందుకు విద్యార్థులు ఏం చేయాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యను అభ్యసించేందుకు తహతహలాడుతున్నారు. చదువులకు దూరమైతే భవిష్యత్తు అంధకారమయం అయిపోతుందేమోనని బాధ. ఈ కరోనా ప్రభావం ఇంకా ఇలా ఎంతకాలం ఉంటుందోనని ఆందోళన. ఇప్పటిదాకా ప్రైవేట్ స్కూళ్లు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుకుంటున్న వారంతా ఫీజుల మోతతో బరువెక్కిన హృదయాలతో అల్లాడిపోయారు. ప్రభుత్వాల సహకారంతో ఉచిత విద్య అందుబాటులోకి వచ్చిన తర్వాత పేద, మధ్యతరగతి పిల్లలకు చదువులతల్లి కరుణా కటాక్షం బాగానే లభిస్తోంది. అయితే, ప్రభుత్వ పాఠశాలలు కూడా కరోనా దెబ్బకు మూతబడడం ఆరోగ్యరీత్యా మంచిదే అయినా చదువులు లేకుండా ఎంతకాలం కాలం గడపాలన్నదే అందరిలోనూ జవాబు దొరకని ప్రశ్న.

ఇప్పటికే దేశంలో ఉన్న దాదాపు 15 లక్షల పాఠశాలల దాకా మూతపడిపోవడంతో, సుమారు 26 కోట్ల మందికి పైగానే విద్యార్థులు చదువులకు దూరమయ్యారని ఒక అంచనా. ఈ పరిస్థితుల్లో వీటన్నిటికీ ఇప్పుడు అందరికీ కనిపిస్తున్న ఒకే ఒక్క తరుణోపాయం.. ఆన్‌లైన్ చదువులే. సాంకేతికపరంగా ఎంత కష్టమైనా సరే ఆన్‌లైన్‌లోనే పాఠాలు చెప్పేందుకు ఉపాధ్యాయులు, నేర్చుకునేందుకు విద్యార్థులంతా సమాయత్తం కావాల్సిందే తప్ప మరో మార్గాంతరం లేదు. కరోనా ప్రభావంతో మునుపటిలా ఎవరూ ఇళ్ళ నుంచి బయటకు రాలేని, హాయిగా బడులకు వెళ్లి అందరూ కలిసి మూకుమ్మడిగా చదువుకోలేని ప్రస్తుత పరిస్థితుల్లో..చదువుకోవాలంటే ఆన్‌లైన్ దారి తప్ప ఎవరికీ మరో దారి కనిపించడం లేదు.

అయితే ఈ తరహా చదువులు చదువుకునే శక్తిసామర్థ్యాలు దేశంలో ఏ కొద్దిశాతం మందికో ఉన్నాయే తప్ప అందరికీ అలాంటి ఆర్థిక వెసులుబాటు కానీ, సాంకేతిక పరిజ్ఞానం కానీ ఉండవన్నది అందరికీ తెలిసిందే. ముఖ్యంగా మనదేశంలో అత్యధికశాతం మంది గ్రామీణులు, కొండకోనల్లో నివసించేవారు, నిరుపేదల పరిస్థితే ఈ విషయంలో మరింత దయనీయంగా ఉంది. అనేకమంది నిరుపేద తల్లిదండ్రులు కూడా నిరక్షరాస్యులు కావడంతో సాంకేతికపరమైన ఆధునిక ఆన్‌లైన్ చదువులంటే వీరికి సరైన అవగాహన ఉండదు. పిల్లల పరిస్థితీ అంతే. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటూ, ప్రభుత్వ హాస్టళ్లలో భోజనం తింటూ కష్టపడి చదువుకునే నిరుపేద విద్యార్థులే ఎక్కువ. వీరికి అవసరమైన ఆధునిక సదుపాయాలు, స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు వగైరాలు ఎక్కడి నుంచి వస్తాయి?..

మరోవైపు.. ఇప్పటికీ దేశంలోని అనేక గ్రామీణ ప్రాంతాల్లో, గిరిజనులు నివసించే ప్రాంతాల్లో ఫోన్లు, లాప్‌టాప్‌లు, కంప్యూటర్‌లు, ఇంటర్నెట్‌ల సదుపాయాలు లేవన్నది కూడా అందరికీ తెలిసిన విషయమే. అంతేకాదు, అత్యధికశాతం మంది అయ్యవార్లకు కూడా ఈ ఆన్‌లైన్ పాఠాలు వల్లించాలంటే ఎంతో కష్టం. అనేకమంది గ్రామీణ ప్రాంతాల ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ పాఠాలు చెప్పడం ఎంతవరకు తెలుసో తెలియదు. అసలు స్మార్ట్ ఫోన్లు ఎందరికుంటాయి?.. వాటిని ఎలా ఉపయోగించుకోవాలో తెలియని విద్యార్థుల సంఖ్య కూడా తక్కువగానే ఉండకపోవచ్చు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ పాఠాలు చదువుకోవాలన్నా ఎంతో కష్టంగా మారిన దుస్థితిలో ఎంతోమంది చిన్నారులు, విద్యార్థులు, యువకులు తమ భవిష్యత్తు ఏమవుతుందోనని ఆందోళనతో కాలం గడుపుతున్నారన్నది వాస్తవం. ఫోన్లకు బాగా అలవాటుపడిన విద్యార్థులకు కూడా ఆన్‌లైన్ పాఠాలు వినడం, వాటిని నేర్చుకుని తమ భవిష్యత్తుకు దారులు వేసుకోవడం అన్నది పెద్ద కసరత్తే.

అందుకే కేంద్రప్రభుత్వం ఈ విపత్కర పరిస్థితుల నుంచి రక్షించి విద్యార్థులకు సురక్షితమైన విద్యను అందించేందుకు పెద్దయెత్తున ఆలోచనలు చేసి బృహత్తరమైన ప్రణాళికలు రూపొందిస్తూనే ఉంది. ఆన్‌లైన్ విద్యను అందరికీ అందుబాటులోకి తేవాలన్న ప్రయత్నాన్ని యుద్ధప్రాతిపదికన చేస్తోంది కూడా. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల చదువుల కోసం టీవీ ఛానళ్ళు, కేబుల్‌టీవీలు, రేడియోలను కూడా వినియోగించేందుకు, వీడియో ఆడియో రికార్డింగ్‌ల ద్వారా కూడా అందరికీ ఆన్‌లైన్ పాఠాలు బోధించేందుకు నిరంతరం కృషి చేస్తూనే ఉండడం ఎంతో సంతోషకరం. ప్రభుత్వ పాఠశాలలను మరింతగా పటిష్టవంతం చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ తమవంతు కృషి చేస్తూనే ఉన్నాయి.

సెప్టెంబర్ నుంచి విద్యార్థులకు ఆన్‌లైన్ పాఠాలు బోధించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని కేంద్రప్రభుత్వం సూచించివున్న నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వాలు ఆ దిశగా ముందడుగు వేస్తున్నాయి. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను రంగంలోకి దింపి సాంకేతికపరమైన విద్యను అందరికీ నేర్పేందుకు తర్ఫీదునివ్వాలని, ఎన్‌సిఇఆర్‌టి రూపొందించిన సురక్షిత ఆన్‌లైన్ అధ్యయనం ద్వారా విద్యార్థుల ఉపాధ్యాయుల స్వీయ డిజిటల్ అభ్యసనానికి దారులు తీయవచ్చని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అందరికీ ఆన్‌లైన్ విద్యను అందుబాటులోకి తేవచ్చని ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఈ కార్యక్రమాలన్నీ ఎంతో దృఢదీక్షతో, సత్సంకల్పంతో వేగవంతంగా జరుగుతూనే ఉన్నాయి. విద్యారంగాన్ని ఈ సంక్షోభం నుండి గట్టెక్కించేందుకు అందరూ తమవంతు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అయితే, క్షేత్రస్థాయిలోకి వచ్చేసరికి ఆ ప్రయత్నాలు ఏ మేరకు సఫలీకృతమవుతాయో చూడాలి!

---

పెంచలకోనలో

## 30 నుంచి పవిత్రోత్సవాలు

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామివారి ఆలయంలో ఈనెల 30వ తేదినుంచి పవిత్రోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ఇ.ఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ పవిత్రోత్సవాల్లో భాగంగా స్వామివారికి 31న కుంభారాధన, అగ్నిప్రతిష్ఠ, పవిత్రాల సమర్పణ, ప్రాకారోత్సవం, సెప్టెంబర్1న చతుస్థానార్చన, వేద పారాయణం, శాంతి హోమం, మహా సంప్రోక్షణ, పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు.

## భక్తిశ్రద్ధలతో రాధాష్టమి



నెల్లూరులోని ఇస్కాన్ మందిరంలో ఈనెల 26న మందిరం అధ్యక్షుడు శుకదేవస్వామి ఆధ్వర్యంలో ఎంతో భక్తిశ్రద్ధలతో రాధాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణులను శోభాయమానంగా అలంకరించి చప్పన్ భోగ్, హారతులిచ్చి కీర్తనలు గానం చేశారు. ఉభయకర్తలుగా గంటా రమణయ్య, వెంకటరెడ్డి, తులసమ్మ వ్యవహరించారు.

## నిజమే!.. ఆంధ్రాలో యంపీలు డమ్మీలే..

ఆంధ్రాలో పార్లమెంటుసభ్యుల పరిస్థితిని గురించి మీ పత్రికలో బాగా రాశారు. వాస్తవ పరిస్థితులను నిర్మొహమాటంగా తెలియజేశారు. నివురుగప్పిన నిప్పులా వున్న పరిస్థితికి అద్దం పట్టారు. నిజానికి ఒకప్పుడు యంపీలంటే సమాజంలో చాలా విలువ, గౌరవం ఉండేది. ప్రస్తుతం ఆంధ్రాలో మాత్రం ఆ పరిస్థితి లేదు. పార్లమెంటుసభ్యులను ప్రజలు మర్చిపోయారు. కేవలం ఒక్క ఏడాదిలోనే ఇలాంటి దుస్థితి వచ్చిందంటే మరో సంవత్సరం గడిచిందంటే వీళ్లు పూర్తిగా ప్రజలకు దూరమైపోతారు.

ప్రజా పరిపాలనా వ్యవస్థలో పార్లమెంటు సభ్యులది కూడా చాలా కీలక పాత్ర. యంపీలకు తగిన ప్రాధాన్యత కల్పించి రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడంలో వారిని పాత్రధారులను చేసి, ఢిల్లీ స్థాయిలో మన హక్కులు సాధించుకోవడానికి వారిని ఆయుధాలుగా వాడుకోవలసిన భాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వానిదే. ఇలా యంపీలను నిర్లక్ష్యంచేసి ఆ వ్యవస్థను నిర్వీర్యం చేసి పార్లమెంటు సభ్యులను డమ్మీలుగా మార్చడం ఎవరికీ మంచిది కాదు. ఒక జాతీయపార్టీ వల భుజాన వేసుకుని అసంతృప్తితో రగిలిపోతున్న వారి కోసం గాలిస్తూ గాలం వేస్తోంది. ఈ తరుణంలో అధిష్టానం కళ్ళు తెరవకుండా నిర్లక్ష్యం వహిస్తే అనర్థాలు తీవ్రంగా ఉంటాయి. మన ముఖ్యమంత్రిగారు స్పందించి జిల్లాల వారిగా యంయల్ఏలను, యంపీలను సమావేశపరచి శాసనసభ్యులతో సమాన అధికారాలు వారికీ కల్పిస్తే బాగుంటుంది.

**పి. కృష్ణయ్య, హైదరాబాదు.**

ఈ-మెయిల్ ప్రజావాణి roopagroup@yahoo.com

## ఎస్‌పి బాలు తెలుగువాడు కాడా..?

ప్రపంచ ప్రఖ్యాత సినిమా గాయకులు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం తెలుగువాడు కాదా...? ఈ అనుమానం ఇప్పుడు అందరినీ పీడిస్తోంది. కరోనా మహమ్మారి బారినపడి మద్రాసు ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందుతున్న తరుణంలో, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులిద్దరూ స్పందించకపోవడం ఈ అనుమానానికి తెరతీసింది. ఆయన పరిస్థితి విషమంగా ఉందని ఆసుపత్రివర్గాలు ప్రకటించిన వెంటనే భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గారు, మన ప్రధానమంత్రి మోడీగార్లతో పాటు కర్ణాటక తమిళనాడు ముఖ్యమంత్రులిద్దరూ స్పందించారు. అటు వెంకయ్యగారూ ఇటు ప్రధానమంత్రి కార్యాలయం ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తుంటే, తమిళనాడు ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి తమ ప్రభుత్వ ప్రతినిధిగా ఒక మంత్రిని ఆసుపత్రికి పంపించి బాలుగారి చికిత్సకు అయ్యే ఖర్చంతా తామే భరిస్తామని, ఎంత ఖర్చయినా పరవాలేదని, ఆయన కోలుకుని ఆరోగ్యంగా తిరిగిరావాలన్నదే తమ కోరిక అని ప్రకటించింది. ఇలాంటి తరుణంలో రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ కనీసం ఒక ప్రకటన ద్వారానైనా బాలుగారి క్షేమాన్ని కాంక్షించకపోవడం బాధాకరం. ఇంతటి మహానుభావుడి ఆరోగ్యం పట్ల రెండు తెలుగురాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం సిగ్గుచేటైన విషయం. ఇది ఒక్క బాలుగారికే కాదు, యావత్ భారతదేశ సంగీత ప్రపంచానికే జరిగిన అవమానం.

**సుబ్బారావు, చెన్నై.**

## యం.పిల సేవలనూ రాష్ట్ర ప్రభుత్వం వాడుకోవాలి

గతవారం 'లాయర్' ఎడిటోరియల్‌లో కూతుళ్ళకు ఆస్తిలో సమాన హక్కు గురించి విపులంగా విశదీకరించారు. రామతీర్థం శివాలయాన్నీ దర్శింప చేయడంతో పాటు, భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి గార్లు చేస్తున్న కరోనా కర్మ కాండలు, అపోహల గురించి చక్కగా వివరించారు. పార్లమెంటుసభ్యుల గురించి చాలా బాగా చెప్పారు. కరోనా వంటి కష్టసమయంలో యంపీలు ప్రజల్లోకి వచ్చి సహాయం అందచేయవచ్చు కదా. వారి వ్యాపారాలు వ్యక్తిగత వ్యవహారాలే వారికి ముఖ్యమా. అయినా ముఖ్యమంత్రిగారు కూడా జోక్యం చేసుకుని పార్లమెంటుసభ్యులను సేవాకార్యక్రమాలలో పాల్గొనేటట్లు చూడాలి.

***లింగాల చంద్రమౌలిరెడ్డి, నెల్లూరు.***


లాయర్

పాఠకులకు మనవి

మా(మీ) లాయర్ పత్రికకు

**సమాచారం / లేఖలు**

పంపదలచిన వారు

**9866314741 నంబరుకు**

వాట్సాప్ ద్వారా గాని, లేదా

roopagroup@yahoo.com కి

ఈ-మెయిల్ ద్వారా గాని

పంపవలసిందిగా విజ్ఞప్తి.

పోస్టల్ చిరునామా :

ప్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు,

మాగుంట లే అవుట్, నెల్లూరు - 3.

- సం/-

# కోవిడ్ బాధితులను ఆదుకోండి

## కలెక్టర్లకు సీఎం ఆదేశాలు



కరోనా బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలని, వారికి మెరుగైన సేవలందించేందుకు అధికారులు కృషిచేయాలని, ఆసుపత్రుల్లో ఏ కరోనా బాధితుడు కూడా తనకు సక్రమమైన సేవలు అందలేదనే ఫిర్యాదు రాకుండా వారికి అవసరమైన వసతులు కలుగజేసి నాణ్యమైన వైద్యసేవలందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఈనెల 25న ఆయన తన క్యాంప్ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కోవిడ్ వైరస్ నిరోధానికి చేపట్టాల్సిన చర్యలను సూచించారు. దేశంలోనే అత్యధికంగా మన రాష్ట్రంలోనే కోవిడ్ వైరస్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని, పాజిటివ్ కేసులను ప్రాథమిక దశలోనే గుర్తించి వెంటనే వైద్యసేవలందించాలన్నారు. కోవిడ్ శాంపిల్స్ నిర్ధారణ ఫలితాలు 24 గంటల్లోనే వచ్చేలా చూడాలన్నారు. సెప్టెంబరు 1వ తేది నుంచి అన్‌లాక్-4 అమలులోకి రానున్న నేపథ్యంలో క్లస్టర్ల నిర్వహణ వీలున్నంత తక్కువ ఏరియాలో ఏర్పాటుచేయాలని జిల్లా ఉన్నతాధికారులకు సూచించారు. అనంతరం రాష్ట్రప్రగతికి చేయాల్సిన అభివృద్ధిపనులను సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు, ఎస్పీ భాస్కర్‌భూషణ్, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి, డిపిఓ ధనలక్ష్మి, డిసిహెచ్ఎస్ డాక్టర్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## కార్పొరేషన్ ఆరోగ్యాధికారి వెంకటరమణ

గత కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తున్నాయని, వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది కనుక నగర ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు పరిసరాల పరిశుభ్రత పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి పి.వెంకటరమణ సూచించారు. ఈనెల 25న నగరంలోని ట్రంకురోడ్డు, కాపువీధి తదితర ప్రాంతాల్లో 'ఇంటింటా చెత్త సేకరణ' అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతి పారిశుద్ధ్య కార్మికుడు కేటాయించిన ప్రాంతాల్లో ప్రతిరోజూ ప్రతి ఇంటికీ వెళ్ళి చెత్త సేకరణ చేయాలని, మురుగుకాలువల్లో పూడిక తీసే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు.

# చంద్రపడియ ఫ్యాక్టరీని పరిశీలించిన అధికారులు

వింజమూరు మండలం చంద్రపడియ గ్రామంలోని ఫార్మా ఫ్యాక్టరీలో ఇటీవల బాయిలర్ పేలిన ఘటనపై విచారణకు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు నియమించిన అధికారుల బృందం ఈనెల 26న ఫ్యాక్టరీని పరిశీలించింది. నిబంధనల ప్రకారం ఈ కర్మాగారంలో అన్ని ఏర్పాట్లు ఉన్నాయో లేదో ఈ బృందం తనిఖీ చేసింది. ఈ బృందంతో పాటు ఆత్మకూరు ఆర్డీఓ ఉమాదేవి, తహశీల్దార్ సుధాకర్‌రావు, ఎంపిడిఓ కనకదుర్గాభవాని వారి వెంట ఉన్నారు.



ఆరుగురు కుమార్తెలు, భర్త బి.స్వామిదాస్‌లతో లిల్లీ స్వామిదాస్



# మేడం @100

## లిల్లీ స్వామిదాస్ శతజయంతి

***నెల్లూరులో 1966, ఆ తరువాత పుట్టిన వారెవరికైనా స్వామిదాస్ స్కూల్ అంటే తెలియకుండా ఉండే ప్రసక్తే లేదు. 1970 తరువాత నెల్లూరు నగరంలో మంచి కాన్వెంటు స్కూలు కావాలనుకునే వారెవరైనా స్వామిదాస్ గడప తొక్కాల్సిందే!***

50 యేళ్ళ ప్రస్థానం, 5000 మంది విద్యార్థినీవిద్యార్థులతో ప్రయాణం. క్రమశిక్షణ, ఉత్తమ శిక్షణ, అత్యున్నత ప్రమాణాలతో విద్యా బోధన చేసే ఏకైక ఇంగ్లీషు మీడియం స్కూలుగా ప్రసిద్ధిచెంది ఎందరో డాక్టర్లను, ఇంజినీర్లను, సైంటిస్టులను, ప్రభుత్వ అధికారులను, వ్యాపారవేత్తలను తీర్చిదిద్దిన ఘనత స్కూల్ వ్యవస్థాపకులు స్వామిదాసు సారుదైతే, పరిపాలనా వ్యవహారాలలో, బోధన, బోధనేతర వ్యవహారాలలో 45 సంవత్సరాల పాటు చురుకైన పాత్ర పోషించిన సత్తా సమర్థత మేడమ్‌ది.

1920, ఆగస్టు 26న కృష్ణా జిల్లా బందరులో జన్మించిన లిల్లీ కమల సుగుణ, 1946 ఫిబ్రవరి 7వ తేదీన తన 25వ యేట నెల్లూరుజిల్లా సూళ్లూరుపేట ప్రాంతంలోని మన్నారు పోలూరుకు చెందిన బిగువ స్వామిదాస్‌ని మనువాడి నెల్లూరు జిల్లా కోడలయ్యింది. లిల్లీ స్వామిదాస్‌గా తన పేరు మార్చుకుంది. పెళ్లికి ముందు ఆమె ఉపాధ్యాయిని, అయితే ఉద్యోగం చేయడం తన భర్తకు ఇష్టం లేదని గ్రహించిన ఆమె, పెళ్లి తరువాత పరిపూర్ణ గృహిణిగా మారింది. భర్త ప్రభుత్వ అధికారి, ఇన్స్‌పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌గా విధులు నిర్వహించేవాడు.

1946లో లిల్లీని తన జీవిత భాగస్వామిగా చేసుకునేటప్పటికే ఆయన కృష్ణా జిల్లాలో విధులు నిర్వహిస్తుండేవాడు. వీరిది పెద్దలు కుదిర్చిన వివాహం. శాఖాపరంగా బదిలీపై రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో పలు హోదాలలో పనిచేసిన స్వామిదాస్, నెల్లూరు పల్లిపాడులోని డిస్ట్రిక్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ & ట్రైనింగ్ (జిల్లా ఉపాధ్యాయ శిక్షణాకేంద్రం, DIET) ప్రిన్సిపాల్‌గా కూడా సుదీర్ఘకాలం పనిచేసి, అనంతరం బదిలీపై చిత్తూరుకు వెళ్లి చివరిగా 1962లో జిల్లా విద్యాశాఖాధికారి (డిఇఓ)గా సొంత జిల్లా నెల్లూరుకు బదిలీ అయ్యారు.

అంకితభావం కలిగిన అధికారిగా ప్రశంసలందుకుని 1969లో అప్పటి నిబంధనల ప్రకారం 55 సంవత్సరాలకే పదవీ విరమణ పొందారు. ఆ తరువాత 1970లో తన పేరునే సంస్థ పేరుగా పెట్టి శ్రీ బి.స్వామిదాస్ ఇంగ్లీష్ మీడియం కాన్వెంటు స్కూలును ఆయన ప్రారంభించారు.

లిల్లీ స్వామిదాస్, 1946 నుండి 1970 వరకు ఆదర్శ ఇల్లాలుగా తన పాత్ర సమర్థవంతంగా పోషించింది. ప్రేమను కురిపించే భార్యగా తన భర్త వెంటనడుస్తూ, ఆరుగురు ఆడపిల్లలకు జన్మనిచ్చి మమతానురాగాలతో వారిని పెంచింది. ఇక 1970 నుండి కుటుంబ వ్యవహారాలతో పాటు తన భర్త ప్రారంభించిన విద్యాసంస్థ నిర్వహణా బాధ్యతలను భుజానికెత్తుకుంది. అలుపెరుగకుండా తన చివరి శ్వాస వరకు 45సంవత్సరాలు స్కూలు కోసం శ్రమించింది, తపించింది. లాభాపేక్ష లేకుండా భావితరాల బంగారు భవిష్యత్తే లక్ష్యంగా తనభర్త ప్రారంభించిన స్కూలును ఎప్పుడూ ఎక్కడా విలువలు తగ్గకుండా కాపాడుకొచ్చిందామె. సమర్థనీయమైన కార్యనిర్వహణాధికారిణిగా కరస్పాండెంట్ పాత్రను పోషించింది. తొలితరం వారికి 'మేడం'గా, తరువాత తరాల వారికి 'బిగ్ మేడమ్'గా అవతరించింది. భర్త ఆశయాలను నెరవేర్చే, భార్యగా ఉత్తమ ఇల్లాలుగా నిలిచింది. అన్నింటినీమించి తన బిడ్డలందరినీ ఉన్నత చదువులు చదివించి బాధ్యతగల అమ్మగా వారిని తీర్చిదిద్దింది. 'తన' అనుకున్న వారినందరినీ చేరదీసి, ఎవరికి ఏ కష్టమొచ్చినా నేనున్నానంటూ అక్కున చేర్చుకుని, ఓ కరుణామయిలా ఆదుకుంది. 12మంది మనుమళ్ళు మనుమరాళ్ళతో పాటు 13మంది మునిమనుమళ్ళు మునిమనుమరాండ్రతో పరిపూర్ణ జీవితం గడిపి, 2015, అక్టోబర్ 28న తన 96వ యేట ఆమె తుదిశ్వాస విడిచింది.

2020లో లిల్లీ మేడమ్ శతజయంతిని, స్కూలు 50 వసంతాల వేడుకను అత్యంత ఆడంబరంగా చేయాలనుకున్న స్కూలు యాజమాన్యం, స్వామిదాస్ కుటుంబసభ్యులు మరియు పూర్వవిద్యార్థుల ఆశలన్నీ అడియాశలు చేసింది "కర్కశ కరోనా".

ఆగష్టు 26న ఆ మానవతామూర్తి శతజయంతి సందర్భంగా... బిగ్ సార్‌ని, బిగ్ మేడమ్‌ని స్మరించుకుంటున్నారు పూర్వ విద్యార్థినీ విద్యార్థులు.

# రెండో పంటకు.. వాన దెబ్బ

## - అకాల వర్షాలతో అల్లాడుతున్న రైతులు

**జిల్లాలో ఇటీవల కురుస్తున్న వానలు రెండోపంట వేసుకున్న రైతాంగానికి ఆశనిపాతంగా మారుతున్నాయి. ఈ అకాల వర్షాలు మా కొంపముంచుతున్నాయి దేవుడో అంటూ రైతులు గోడుగోడుమంటున్నారు. గత కొద్దిరోజులుగా ఆయా మండలాల్లో కురుస్తున్న వానల దెబ్బకు వంద లాది ఎకరాల్లో ఏపుగా పండుతున్న వరి, చేతికందివస్తుం దనుకున్న వేరుశనగ పంట నీట మునుగుతుండడంతో వారి బాధ వర్ణనాతీతంగా ఉంది. ముఖ్యంగా సోమశిల జలా శయం కింద పంటలు సాగవుతున్న బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, కొడవలూరు, విడవలూరు, ముత్తుకూరు, తోటపల్లి గూడూరు, అల్లూరు, దగదర్తి, ఇందుకూరు పేట, నెల్లూరు రూరల్ తదితర మండలాల్లోని రైతులు ఈ అకాలవర్షాలకు కుదేలైపోతున్నారు. పంటలు చేతికి అందివస్తున్న తరుణంలో కురుస్తున్న ఈ వర్షాలు తమను నష్టాల పాలు చేస్తున్నాయని వారు ఆవేదన చెందుతున్నారు.**



సోమశిల, కనిగిరి రిజర్వాయర్ల పరిధిలో సుమారు 2 లక్షల ఎకరాల దాకా రైతులు రెండవ పంటగా వరి, వేరుశనగ పంటలు సాగుచేసుకుంటున్నారు. మరో రెండుమూడు వారాల్లో కోతలకు కూడా సిద్ధమవుతున్నారు. కానీ, ఈ మధ్యలోనే వానలు కురవడంతో ఏపుగా పెరిగిన పంటలు నేలకొరిగిపోతున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. ఆరుగాలం శ్రమించి, అప్పోసప్పో చేసి పంటలు వేసుకుంటే తీరా పంటలు పండిన తర్వాత కోతకు వచ్చే దశలో అకాలవర్షాలు కురుస్తుండడంతో, నీళ్లలోకి ఒరిగి పోయిన వరిని కోత కోయడం కూడా ఎంతో కష్టమని, తాము కోలుకోలేనంత నష్టాలకు గురవుతామంటూ వారు దిగులుతో కంట తడిపెడుతున్నారు.

### బోగోలు రైతుల విలవిల :

గత ఏడాది కరువుతో తల్లడిల్లుతున్న బోగోలు రైతులకు ఈ ఏడాది ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చొరవ తీసుకుని రెండోపంటకు సాగునీరు ఇప్పించడంతో ఇక్కడి రైతులు అనేకమంది వరి, వేరుశనగ పంటలు వేసుకున్నారు. ఇక కొద్దిరోజుల్లోనే ఈ పంటలు చేతికి వస్తాయనుకుంటున్న దశలో అకాలవర్షాలు రైతులకు నష్టాన్ని మిగిల్చాయి. కొద్దిచోట్ల వేరుశనగ పంట నీళ్లలో తేలాడుతూ ఉంది. వరి కంకులు నీళ్లలో మునిగిపోయాయి. సుమారు 1200 ఎకరాల్లో పంటలు బాగా దెబ్బతిన్నట్లు ప్రాథమిక సమాచారం. జిల్లా ఉన్నతాధికారులు తమ దయనీయస్థితిని గమనించి ఈ నష్టాల నుంచి తమను గట్టెక్కించాలని రైతులు కోరుకుంటున్నారు.

### దగదర్తిలో నీట మునిగిన శనగ

దగదర్తి మండలంలో ఇటీవల కురిసిన వర్షాలతో శనగ పంట బాగా దెబ్బతింది. మూడు వంతుల పంట నీట మునిగి ఎందుకూ పనికిరాకుండా పోయింది. ఆ పంటను రైతులు బయటకు తీసేందుకు అవసరమైన కూలీలను పెట్టుకునేందుకు కూడా కష్టంగా మారింది. తడిసిన వేరుశనగను విక్రయించుకునేందుకు కూడా ఎంతో కష్టంగా ఉంది. దళారులు చాలా స్వల్ప ధరకే పంటను అడుగుతుండడంతో ఏం చేయాలో అర్థంకాక రైతులు కన్నీళ్ళు పెట్టుకుంటున్నారు.

# 24 గంటల్లో ఫలితాలు రావాలి

**- కోవిడ్ నిర్ధారణ పరీక్షలపై కలెక్టర్ సమీక్ష**



కోవిడ్ నిర్ధారణ పరీక్షలకు సంబంధించి 24గంటల్లోనే ఫలితాలు వచ్చేట్లుగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు అధికారులకు సూచించారు. నెల్లూరు నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఉదయం ఆయన వైద్యశాఖ, వి.ఆర్.డి.ఎల్. ల్యాబ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కోవిడ్ స్వాబ్ శాంపిల్స్ ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం 5గంటల వరకూ సేకరించినవి, అదేరోజు వి.ఆర్.డి.ఎల్. ల్యాబ్‌కు చేరుకోవాలని, 24గంటల్లో శాంపిల్స్‌ని పరీక్షించి, వ్యాధి నిర్ధారణ ఫలితం సంబంధిత వ్యక్తి మొబైల్‌కు చేరాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. అసింథ మాటిక్ కోవిడ్ పాజిటివ్ కేసులు 90శాతం నమోదవుతున్నాయని, వ్యాధి నిర్ధారణ ఫలితం త్వరగా రాకపోతే అసింథమాటిక్ పాజిటివ్ వ్యక్తి నుంచి మరింత మందికి వైరస్ సోకే ప్రమాదం ఉందని, దీనిని నివారించి కోవిడ్ మహమ్మారిని నిర్మూలించాలంటే 24గంటల్లో కోవిడ్ వ్యాధి నిర్ధారణ ఫలితం ప్రకటించాలన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ లేనంతగా జిల్లాలో 2వ వి.ఆర్.డి.ఎల్ ల్యాబ్‌ను కూడా ఏర్పాటుచేశామని, సిబ్బందిని, పరికరాలను అందించామన్నారు. అసింథమాటిక్ కేసులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, వారిని గుర్తించిన వెంటనే కోవిడ్ కేర్ సెంటర్‌కి తరలించి, వారి నుంచి వ్యాధి వ్యాప్తి కాకుండా అడ్డుకట్ట వేస్తే కోవిడ్‌ను నివారించవచ్చన్నారు. డి.ఎం.హెచ్.ఓ రాజ్యలక్ష్మి, వి.ఆర్.డి.ఎల్. ల్యాబ్ హెచ్.ఓ.డి., జిల్లా టి.బి. కంట్రోల్ అధికారులు హాజరయ్యారు.

**కార్పొరేషన్ పారిశుద్ధ్య సిబ్బంది**

# సేవలకు ప్రశంసలు

**నెల్లూరు కార్పొరేషన్‌లో 21 మందికి అవార్డులు**

స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ఉత్తమసేవలందించే ప్రభుత్వోద్యోగులకు ప్రశంసాపత్రాలు, పురస్కారాలు అందజేస్తుండడం అందరికీ తెలిసిందే. నెల్లూరు కార్పొరేషన్‌లో ఆరోగ్యవిభాగంలో పనిచేసే పలువురు ఉద్యోగులు, పారిశుద్ధ్య సిబ్బందికి ఆ ప్రశంసాపత్రాలు అందడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కరోనా నిబంధనల నేపథ్యంలో ఈనెల 15న ఆ ప్రశంసాపత్రాలను పంపిణీ చేయలేదు. ఈనెల 24న వాటిని కలెక్టరేట్ నుంచి కార్పొరేషన్ కార్యాలయానికి పంపారు. కార్పొరేషన్ ఆరోగ్య అధికారి వెంకటరమణయ్య సంబంధిత సిబ్బందికి అందజేసి, వారిని అభినందించారు. కరోనా విపత్తు లోనూ నగరంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచినందుకు ఆరోగ్యాధికారి వెంకటరమణయ్యకు, ముగ్గురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 12మంది సచివాలయ శానిటరీ సెక్రటరీలకు, అయిదుగురు పారిశుద్ధ్య కార్మికులకు ఈ అవార్డులు లభించడం విశేషం. ఈ స్ఫూర్తితో సిబ్బంది మరింత ఉత్సాహంతో పని చేసి ప్రజలకు సేవలందించాలని వెంకటరమణయ్య పిలుపునిచ్చారు.

# జిల్లా ఇసుక అధికారిగా.. వంశీధర్‌రెడ్డి

జిల్లా ప్రజలకు ఇసుక కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం తాజాగా జిల్లాకు ఒక కొత్త పోస్టును ఏర్పాటుచేసింది. డిస్ట్రిక్ట్ శాండ్ ఆఫీసర్ (జిల్లా ఇసుక అధికారి)గా కృష్ణాజిల్లా గనులశాఖలో అసిస్టెంట్ జియాలజిస్ట్‌గా పనిచేస్తున్న వంశీధర్‌రెడ్డిని ఈ పోస్టులో నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులు వచ్చాయి. ఇసుక కావాలనుకున్నవారికి నిబంధనల మేరకు వెంటనే వారి ఇళ్ళ వద్దకే ఇసుక చేరేలా చూడడం, జిల్లాలోని ఇసుక వినియోగదారుల కష్టాలు తీర్చడం ఈ అధికారి పని. ఇసుక అధికారిగా వంశీధర్‌రెడ్డి రాకతో ప్రజలకు ఇసుక కష్టాలు తీరుతాయని ఆశిద్దాం!...

# పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ పరికరాలు

కరోనా విపత్తులో ప్రజల సంక్షేమం కోసం పారిశుద్ధ్య కార్మికులు ఎనలేని సేవలందిస్తున్నారని, వారికి స్వీయ ఆరోగ్య పరిరక్షణ పరికరాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని జిల్లా పంచాయతి అధికారి ధనలక్ష్మి చెప్పారు. నెల్లూరులోని పాత జడ్పీ కార్యాలయంలో ఈనెల 25న ఆమె పారిశుద్ధ్య కార్మికులకు పిపిఇ కిట్‌లను అందజేశారు. గ్రామ పంచాయతీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫారం, హెల్మెట్, బూట్లతో కలిపి ఉన్న పిపిఇ కిట్‌లు జిల్లాకు 704 మంజూరయ్యాయని, వాటిని జిల్లాలోని అన్ని మండలాలకు కేటాయిస్తామని తెలిపారు.

# నెల్లూరు కబుర్లు

**కరోనా నేపథ్యంలో...**

# ఈసారి రొట్టెల మార్పిడి లేదు

- **ఆగస్టు 30 నుంచి రొట్టెల పండుగ**
- **గంధమహోత్సవానికి 20 మందికే అవకాశం**

కులమతాలకు అతీతంగా, మతసామరస్యానికి ప్రతీకగా ఏటా లక్షలాదిమంది భక్తులతో నెల్లూరు చెరువుగట్టున ఉన్న బారాషహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండుగ ఆగస్టు 30 నుంచి సంప్రదాయబద్ధంగా జరుగనుంది. కరోనా నేపథ్యంలో ఈసారి అధికారులు రొట్టెల పండుగ విషయమై ఈనెల 24న సమీక్షించారు. ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 3వ తేది వరకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ పండుగ నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎంవి రమణ అధికారులను ఆదేశించారు. కోవిడ్ వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ఎక్కడా జనసమూహం ఉండకూడదని, గంధమహోత్సవం 20 మందితో మాత్రమే నిర్వహించాలని తెలిపారు. కరోనా మూలంగా ఈసారి రొట్టెల మార్పిడి కూడా లేదన్నారు. దర్గాలో సంప్రదాయబద్ధంగా జరిగే కార్యక్రమాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, భక్తులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. కరోనా నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సహృదయంతో సహకరించాలని అధికారులు కోరారు. ఈ సమావేశంలో నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్, రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

**మంత్రి అనిల్ చొరవతో..**

# నగరంలో వంతెన మంజూరు

ఎన్నో ఏళ్ళుగా నగర ప్రజలు ఎదురుచూస్తున్న వంతెన నిర్మాణానికి రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డా.అనిల్‌కుమార్‌యాదవ్ చొరవతో ముందడుగు పడింది. నెల్లూరు నగరంలోని మినీబైపాస్ రోడ్డులో ఉన్న జిపిఆర్ కల్యాణమండపం నుంచి జొయలుక్కాస్ షోరూం దాకా స్టేట్ నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో ఈ వంతెన నిర్మాణం జరుగనుంది. సుమారు 50 కోట్ల రూపాయలు వ్యయమయ్యే ఈ వంతెన మంజూరుకు మంత్రి ఎంతో కృషి చేశారు. మరికొద్ది రోజుల్లోనే శంకుస్థాపన చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఈ వంతెన నిర్మాణంతో నగరంలో ట్రాఫిక్ సమస్య ఒక కొలిక్కి వస్తుందని భావిస్తున్నారు.

# సిఐటియు ధర్నా

కరోనా మూలంగా ఉపాధి కోల్పోయిన కార్మికులను ఆదుకోవాలంటూ నెల్లూరులో సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల23న అయ్యప్ప గుడి వద్ద ఆందోళన నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కార్మికులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి కార్మికుని కుటుంబానికి రూ.7500లతో పాటు 19కిలోల బియ్యం అందజేయాలని కోరారు. సిపిఎం నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు, అల్లాడి గోపాల్, సంపత్‌కుమార్, కాలేషా, సుధాకర్, అనిల్, పాపారాయుడు, మణి పాల్గొన్నారు.

**జాతీయ చేనేత బోర్డును**

# పునరుద్ధరించాలి

చేనేత కార్మికులను ఆదుకునేందుకు గతంలో ఏర్పాటుచేసిన ఆలిండియా హ్యాండ్లూమ్ బోర్డు, పత్తి బోర్డులను కేంద్రప్రభుత్వం పునరుద్ధరించాలని బిజెపి చేనేత సెల్ మాజీ అధ్యక్షుడు చక్రధారి కోరారు. ఈ విషయమై కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు ఈనెల25న వినతి పత్రం పంపినట్లు పేర్కొన్నారు.

# రైతులను ఆదుకోండి

**- బీజేపీ నాయకుల వినతి**

జిల్లాలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసిపోవడంతో ఆ ధాన్యాన్ని అమ్ముకోలేక రైతులు నానా అవస్థలు పడుతున్నారని, వారిని వెంటనే ఆదుకోవాలని బిజెపి రాష్ట్ర అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి ఈనెల 25న నెల్లూరులోని కలెక్టరేట్‌కు వచ్చి డిఆర్ఓ ఎంవి రమణకు వినతిపత్రం అందజేశారు.

# అరుణ్‌జైట్లీకి నివాళులు

బిజెపి సీనియర్ నేత, దివంగత కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈనెల 24న నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు జైట్లీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అరుణ్‌జైట్లీ బహుముఖప్రజ్ఞాశాలి అని వారు కొనియాడారు. బిజెపి నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, పి.సురేంద్ర రెడ్డి, మిడతల రమేష్, రాధాకృష్ణ, శ్రీనివాసులు, సురేష్, కొండయ్య, పరశురాం పాల్గొన్నారు.

**జిల్లాలో 16,801 మందికి**

# కొత్తగా పింఛన్లు

**కలెక్టర్ చక్రధర్‌బాబు వెల్లడి**

జిల్లాలో 16801 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. ఈనెల 26న ఆయన నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో డిఆర్‌డిఏ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మొత్తం 3,61,624 మంది పింఛనుదారులున్నారని, వారికి సెప్టెంబరు 1వ తేదీన పింఛను ఇస్తారని అంటూ అందుకు 88,37,22,250 రూపాయలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

**'నాడు-నేడు' పనులు పూర్తిచేయండి :**


సెప్టెంబరు 5వ తేది నుంచి ప్రభుత్వ పాఠశాలలు పున:ప్రారంభమయ్యే అవకాశాలున్నందువల్ల నాడు-నేడు పనులు నూటికి నూరుశాతం పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులందరికీ విద్యాకానుక కిట్స్ అందజేయాలని, వైయస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని పటిష్టంగా అమలుచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే నెలలో అంగన్‌వాడీ కేంద్రాలు కూడా ప్రారంభం కానున్నాయని, వాటిని కూడా సిద్ధం చేయాలని ఐసిడిఎస్ అధికారులకు చెప్పారు.కోవిడ్ నిబంధనలను అందరూ తప్పనిసరిగా పాటించాలని, మాస్కులు ధరించి సామాజిక దూరం పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు.

# కొత్త డిఇఓగా రమేష్

జిల్లా విద్యాశాఖ అధికారిగా పి.రమేష్‌ను నియమిస్తూ ఈనెల 26న ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీచేసింది. గుంటూరు జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారిగా విధులు నిర్వహిస్తున్న రమేష్‌ను డిఇఓగా నియమించారు. డిఇఓగా ఉన్న జనార్దనాచార్యులు గతనెలలో పదవీ విరమణ చేయడంతో, ఇప్పటిదాకా ఆ బాధ్యతలను ఆర్‌జెడి రవీంద్రనాథ్‌రెడ్డి నిర్వహిస్తున్నారు. కొత్త డిఇఓ రాకతో పూర్తిస్థాయి బాధ్యతలను రమేష్ స్వీకరించనున్నారు.

# ప్రజలను ఆదుకోలేని ప్రభుత్వం

**- తాళ్ళపాక విమర్శ**



కరోనా కష్టకాలంలో ప్రజలను ప్రభుత్వం ఆదుకోలేకపోతోందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తాళ్ళపాక అనురాధ విమర్శించారు. ఈ కరోనా విపత్తులో ప్రజలకు మాస్కులే సక్రమంగా ఇవ్వలేని ప్రభుత్వం మూడు రాజధానులను ఏవిధంగా ఏర్పాటు చేస్తుందని ఆమె విమర్శిస్తూ, రాజధాని అమరావతి కోసం టిడిపి పోరాటం కొనసాగిస్తుందని ఈనెల 23న ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# రాహుల్‌గాంధీయే అధ్యక్షుడిగా ఉండాలి

**- ఏకగ్రీవంగా తీర్మానించిన జిల్లా కాంగ్రెస్**



అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా రాహుల్‌గాంధీనే కొనసాగించాలని కోరుతూ నెల్లూరుజిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి కోరారు. ఈనెల 24న నెల్లూరు నగరంలోని ఇందిరా భవన్‌లో జరిగిన డిసిసి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా రాహుల్‌గాంధీకి తాము పూర్తి మద్దతు తెలుపుతున్నామన్నారు. దేశ సమగ్రాభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్‌పార్టీ వల్లే సాధ్యమన్నారు. దేశం కోసం అసువులుబాసిన ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ వారసులైన సోనియా, రాహుల్‌గాంధీ మాత్రమే జాతీయపార్టీ అధ్యక్షులుగా కొనసాగాలని వారికి మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు బాలసుధాకర్ నాయకులు ఉడతా వెంకట్రావ్‌యాదవ్, షేక్ ఫయాజ్, ఏటూరు శ్రీనివాసులురెడ్డి, భవాని నాగేంద్రప్రసాద్, కొండా అనిల్‌కుమార్, గణేష్ బాబు, షేక్ అల్లాఉద్దీన్, డిసిసి కార్యదర్శులు అరవ రాంప్రసాద్, అరవ రామ్మోహన్‌రావు, ఎన్ రాజేష్‌రెడ్డి, సురేష్‌బాబు, షేక్ సర్పరాజ్, షబ్బీర్, మస్తాన్, పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# చాముండేశ్వరి అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

**- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న**



జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నంలో వెలసివున్న శ్రీ చాముండేశ్వరిదేవి అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషిచేస్తానని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చెప్పారు. ఈనెల 25న ఆయన ఆలయం వద్దకు వచ్చి కోనేరు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆలయంలో పలు నిర్మాణ పనులపై అధికారులతో చర్చించారు. తన సొంత నిధులతో నూతనంగా నిర్మిస్తున్న పంచముఖ విఘ్నేశ్వరుని ఆలయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు రజత్‌కుమార్‌రెడ్డి, కోడలు పూజారెడ్డి తదితరులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి విజయ్‌కుమార్, ఆలయ ఛైర్మెన్ కొండూరు కృష్ణారెడ్డి, నాపా వెంకటేశ్వర్లునాయుడు, పంబాల జనార్దన్‌రెడ్డి, వేణుంబాక మహీధర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి కొత్త రథం

**- 7లక్షల వ్యయంతో ముస్లిం భక్తుల కానుక**



జిల్లాలో ఎంతో ప్రసిద్ధమైన ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నంలో వెలసివున్న శ్రీ చాముండేశ్వరిదేవి అమ్మవారి పట్ల షేక్ రషీద్, షబ్బీర్ అనే ముస్లిం భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. దాదాపు 7 లక్షల రూపాయల వ్యయంతో చక్కని రథాన్ని తయారుచేయించి ఈనెల 23న అమ్మవారికి సమర్పించుకున్నారు. రథాన్ని రకరకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి గంగపట్నంలోని ఆలయం వద్దకు తీసుకువచ్చి అమ్మవారిని రథంలో కొలువుదీర్చి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాతలతో పాటు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.




# మండుతున్న ధరలు

## జంకుతున్న జనులు



***ఈ** మాయదారి కరోనా రానేవచ్చింది గానీ, ఇదే అదనుగా కూరగాయల వ్యాపారులు తమ ఇష్టం వచ్చినట్లు ధరలు పెంచేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. అదేమని అడిగితే 'కరోనాలో ఇంతే.. కూరగాయలు తీసుకురావాలంటేనే మహా కష్టంగా ఉంది. కొంటే కొనండి.. లేకపోతే లేదు'.. అని చాలాచోట్ల వ్యాపారులు నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు భగ్గుమంటున్న ఆ ధరలను చూసి వాటిని కొనలేక, తినలేక నానా అవస్థలు పడుతున్నారు.*

ఈ కరోనా కాలం.. నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు మరింత కష్టాలనే తెస్తోంది. నిత్యావసర వస్తువులైన కూరగాయలను కొనుగోలు చేయాలంటే చేతిలో ఎంతున్నా చాలడం లేదు. అన్ని రకాల కూరగాయల ధరలు ఆకాశానికంటుతూనే ఉండడంతో, ఏం కొనాలన్నా ఆలోచించాల్సి వస్తోందని నెల్లూరు నగర ప్రజలు రోజూ బాధపడుతూనే ఉన్నారు. కూరగాయలు పండించిన రైతులకు గిట్టుబాటు ధర లేక వారు అవస్తలు పడుతుంటే, వ్యాపారులు ఆ కూరగాయలను తక్కువధరకు కొని, వాటినే అధికధరలకు విక్రయించి ప్రజల జేబులు ఖాళీ చేసేస్తున్నారు. ప్రధానంగా టమోటాల ధర రోజుకో రకంగా చుక్కలను చూపిస్తోంది. మూడురోజుల క్రితం కిలో 30 రూపాయలున్న వీటి ధర ఇప్పుడు ఏకంగా 60రూపాయలకు పెరిగింది. వంకాయలు, పచ్చిమిరపకాయలు, ఉల్లగడ్డలు కూడా అంతే. ఒకరోజు 30 రూపాయలుంటే మరుసటి రోజుకే రెండింతలు పెరుగుతోంది. 40 రూపాయలున్న కిలో క్యారెట్ ధర ఇప్పుడు 70రూపాయలు చెప్తున్నారు. చివరికి బీరకాయలు, కాకరకాయలు, బీనీసు వంటి కూరగాయల ధర కూడా కిలో 30 నుంచి 70కి, 80కి పెరుగుతోంది. మార్కెట్‌లో ఉన్న ధరల కంటే కనీసం రెండింతలు మూడింతలు చెప్తూ ప్రజలను అడ్డంగా నిలువుదోపిడీ చేసేస్తున్నారు.

### వంద ఇచ్చినా.. సంచి నిండదు

కరోనా నిరోధానికి నెల్లూరు నగరంలోని ప్రధానమైన ఏసి కూరగాయల మార్కెట్ మూత పడడంతో ఇతరత్రా మార్కెట్లు, కూరగాయల దుకాణాల్లో వారు చెప్పే ధరలకు అడ్డే ఉండడం లేదు. మార్కెట్ల నుంచి దుకాణదారులు సాధారణ ధరలకే కొని తీసుకువచ్చి, తమ దుకాణాల్లో మాత్రం ధరలు దంచేస్తున్నారు. కరోనా దెబ్బతో ప్రజలు దూరప్రాంతాల్లో ఉన్న మార్కెట్లకు వెళ్ళలేక స్థానికంగా ఎక్కడికక్కడ దొరికే కూరగాయలనే కొనేందుకే వస్తుండడంతో ఇదే సందని దుకాణాల్లో ధరల మోత మోగిస్తున్నారు. వంద రూపాయలు పెట్టినా చిన్న సంచిలో కూడా కూరగాయలు నిండలేని దుస్థితి చూసుకుని తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక కొనుగోలుదారులు ఆవేదనలో పడిపోతున్నారు. ఒకవేళ అధికారులు ఈ దుకాణాల్లో తనిఖీలకు వచ్చి ధరల నియంత్రణకు సిద్ధమైనా ఏ కొద్దిరోజులో ఆ ప్రభావం ఉంటుంది కానీ ఆ తర్వాత మళ్లీ మామూలే అయిపోతుందని ప్రజల ఆవేదన. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు మార్కెట్లను, నగరంలోని దుకాణాల్లోను ధరల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# రైతుజన బాంధవుడు.. వైయస్ జగన్

**మంత్రి అనిల్**



జిల్లాలో రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని, ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి అన్నదాతలను ఆదుకుంటామని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డా.పి.అనిల్ కుమార్‌యాదవ్ అన్నారు. ఈనెల 24న ఆయన రైతులకు మద్దతు ధర ఇచ్చే విషయమై నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్యలతో పాటు జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతుల సంక్షేమానికి నిరంతరం కృషిచేస్తూ రైతుపక్షపాతిగా, రైతుజన బాంధవునిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. అధికారులు జిల్లాలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతుధర కల్పించడంలో ఎలాంటి అలక్ష్యం వద్దన్నారు. ఈ విషయంలో పురోగతి కోసం ప్రతి మండలానికి ఒక తహశీల్దార్, లేదా ఆ స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమిస్తామన్నారు. రైతులు ఎలాంటి సమస్యలున్నా ఆ అధికారులకు తెలియజేయాలని కోరారు. మహానేత డా.వైయస్ కుమారుడు డా.వైయస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత జిల్లాలో నీటికొరత లేకుండా పోయిందన్నారు. సోమశిల జలాశయం నిండా పుష్కలంగా నీళ్ళున్నాయని, చెరువులు దొరువులన్నీ జలకళతో కళకళలాడుతున్నాయని అన్నారు. సిఎం వైయస్ జగన్ హయాంలో జిల్లాలో రెండో పంటకు సాగునీటి సమస్య తొలగిపోయిందన్నారు. డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కావలి ఏఎంసి ఛైర్మెన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి, కొండూరు అనిల్‌బాబు, దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, గొల్లపల్లి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కరోనాను కట్టడి చేయండి

జిల్లాలో కోవిడ్ వైరస్ ఉధృతంగా వ్యాపిస్తూ మరణాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు మరింత వేగవంతంగా పనిచేసి కరోనాను కట్టడి చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 24న ఆయన నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో వైద్యాధికారులు, నోడల్ అధికారులతో సమావేశమై గత కొద్దిరోజులుగా జిల్లాలో కరోనా మరణాల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్ పరీక్షలను వేగవంతగా చేసి ఫలితాలు తెప్పించాలని, పాజిటివ్ వచ్చిన వారికి వెంటనే మెరుగైన వైద్యచికిత్సలందించాలని చెప్పారు. కోవిడ్ ఆసుపత్రుల్లో బెడ్‌లు చాలడం లేదనేమాటే రాకూడదని ఇప్పటికే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి స్పష్టంచేసిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. ఆసుపత్రుల యాజమాన్యాలు, అధికారులు సమన్వయంతో కరోనా రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నారాయణ ఆసుపత్రిలో అధికంగా ఉన్న వైద్యులను జిజిహెచ్‌లోని ఐసియు విభాగంలో సేవలను అందించేందుకు పంపాలని మంత్రి సూచించారు. నెల్లూరు పెద్దాసు పత్రిలో ఐసియు విభాగంలోని సౌకర్యాలను ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూ రోగులకు ఉత్తమమైనరీతలో సేవలందించాలని. కార్పొరేట్‌స్థాయిలో ఆ విభాగంలో సదుపాయాలు కల్పించాలని జేసీ ప్రభాకర్‌రెడ్డికి సూచించారు.

# పినాకిని గాంధీజీ ఆశ్రమం కన్వీనర్‌గా కల్పనమ్మ

ఇందుకూరుపేట మండలంలోని పినాకిని గాంధీ ఆశ్రమం కన్వీనర్‌గా గణేశం కల్పనమ్మ నియమితులయ్యారు. ఈనెల 23న ఆశ్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి ఆ నియామకపత్రాలను ఆమెకు అందజేశారు. గతంలో ఆశ్రమ కన్వీనర్‌గా విశేష సేవలందించిన గణేశం కృష్ణారెడ్డి మృతిచెందడంతో ఆ స్థానంలో ఆయన సతీమణి కల్పనమ్మను నియమించారు. ఆశ్రమ సభ్యులుగా జి.దయాకర్‌రెడ్డి, జి.లక్ష్మి, సిహెచ్ నారాయణ, ఆర్.శివరామయ్య, జి.మంజుల, వెంకటేశ్వరప్రసాద్, ఎం.శ్రీనివాసమ్మ, బి.సుధారాణి, వి.శివశేఖర్‌రెడ్డి, వి.నిరంజన్‌రెడ్డి, విజితమ్మ, జి.వి రామిరెడ్డి, పెంచలరెడ్డి నియమితులయ్యారు.


100th Birthday tribute to
Smt. B.LILY SWAMIDOSS



Mom
Pleasure to cherish
The treasured memories of your
Astonishing beauty, Effulgent Smile
Elegant personality
Magnificent Stature
Exceeding generosity,
Charming dignity
Amazing enthusiasm, Astute empathy
Splendid reputation & conscientious administration
you are Gem of a person and crown of the family
We miss you n love u mom

Smt. B.Lily Swamidoss
26-08-1920 • 26-8-2020
Correspondent
Sri B.Swamidoss EM School

With centenary Salutations
Family members.

# తడి పేరుతో దోపిడీ..

- తేమ, నెమ్ము అంటూ రైతుల్ని దోచేస్తున్నారు
- ధరలు తగ్గించి ధాన్యం కొనేస్తున్నారు
- ఈ అన్యాయాన్ని అరికట్టాలంటున్న సోమిరెడ్డి



'జిల్లావ్యాప్తంగా రెండోపంట చేతి కొచ్చింది. వరికోతలు ముమ్మురంగా సాగుతున్నాయి. అయితే గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారు. మిల్లర్లు ఇదే అదనుగా తేమ పేరుతో నెమ్ముశాతం పేరుతో ధాన్యానికి బాగా ధర తగ్గించి కొంటూ రైతులను దోపిడీ చేస్తున్నారు. వెంటనే ప్రభుత్వం రైతులకు గిట్టుబాటుధర కల్పించాలి. ఎడగారు రైతులను ఆదు కోవాలి'.. అని మాజీమంత్రి, టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. ఈనెల 25న ఆయనొక ప్రకటన విడుదల చేస్తూ ధాన్యం 1010 రకం ప్రభుత్వ ధర కామన్ వెరైటీకి 15,720 రూపాయలు రావాలి కానీ రైతుల వద్ద 11,500 రూపాయలకే కొంటున్నారని, అదేవిధంగా నెల్లూరు జిలకర ఫైన్ వెరైటీకి ప్రభుత్వ మద్దతు ధర 15,980 రూపాయలుంటే రైతుల వద్ద నుంచి మిల్లర్లు కేవలం 9800 రూపాయలకే కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. మసూరా రకం 3354 పేరుతో కొత్త వంగడాన్ని ప్రభుత్వమే ప్రవేశపెట్టి అధికదిగుబడి వస్తుందని రైతులకు చెప్పిందని, కామన్ వెరైటీ కింద పుట్టికి 15,720 రూపాయలు రావాల్సి ఉన్నా, ఏపి, తెలంగాణ వ్యాపారులెవరూ కొనుగోలు చేయకపోవడంతో చెన్నైలోని రెడ్‌హిల్స్‌లో ధాన్యం పుట్టి 8వేల రూపాయలకు అమ్ముకోవాల్సిన దుస్థితి రైతులకు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

### మిల్లర్ల దోపిడీ దారుణం :

జిల్లాలో వర్షాల కారణంగా చాలా చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. ఇదే అదనుగా మిల్లర్లు నెమ్ము, తరుగు పేరుతో పుట్టి 960 నుంచి 1040 కేజీల దాకా తీసుకుంటున్నారని, ఈ దోపిడీని అరికట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. టిడిపి ప్రభుత్వ హయాంలో 2018లో బిపిటి రకంలో విరుగుడు వచ్చిందని, ఆ సమయంలో రైతులను ఆదుకునేందుకు క్వింటాలుకు 200 రూపాయల వంతున రైతులకు బోనస్ ఇవ్వడం జరిగిందని, పుట్టికి మొత్తంగా 1700 రూపాయల వరకు చెల్లించామని ఆయన గుర్తుచేశారు. అప్పట్లో రైతులకు అదనపు భారం లేకుండా తామెన్నో చర్యలు చేపట్టామని, రైతుల కోసం టిడిపి హయాంలో ఎన్నో మేలైన పనులు చేస్తే తాము వారివద్ద ముడుపులు తీసుకున్నామని కొందరు నిందలు మోపారని ఆయన పేర్కొంటూ ఇప్పుడు తడి పేరుతో మిల్లర్లు రైతుల వద్ద వందల కిలోలు తీసేసుకుంటుంటే వాళ్ళేం చేస్తున్నారో అర్థం కావడం లేదని సోమిరెడ్డి విమర్శించారు. తేమ పేరుతో దోచుకుంటున్నారని, ధరలు భారీగా తగ్గించేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. వెంటనే రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని, గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు తరుగు పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని ఆయన కోరారు.



## గూడూరు డివిజన్ వార్తలు

# ఆగని కరోనా వ్యాప్తి



కరోనా బాధితులను పరామర్శిస్తున్న సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఓబులేసు

గూడూరు పట్టణంలోని గమళ్ళపాలెం, మహాలక్ష్మమ్మ ఆలయం ప్రాంతంలో హోం క్వారంటైన్‌లో వుంటున్న పలువురు కరోనా బాధితులను సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఓబులేసు ఈ నెల 25వ తేదీ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొన్నారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ హోం క్వారంటైన్‌లో ఉండేవారిని వాలంటీర్లు, వైద్యసిబ్బంది పర్యవేక్షించాలని సూచించారు. కరోనా నియంత్రణ చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు. డిప్యూటి డిఎంహెచ్‌వో అచ్యుతకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# 100కు పైగా 'ప్రగతి' సేవలు



ప్రశంసా పత్రంతో ప్రగతి సేవాసంస్థ సభ్యులు

ఈనెల 22వ తేదీతో ప్రగతి సేవా సంస్థ వందకుపైగా సేవా కార్యక్రమాలు చేయటం జరిగింది. ఈ సేవలకు గుర్తింపుగా ఆగస్ట్ 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవం నాడు గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ, ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు, మునిసిపల్ కమిషనర్ ఓబులేసు, ఎమ్మార్వో లీలారాణిల చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకోవడం జరిగిందని ఆ సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ తెలియజేశాడు. తమ సంస్థ కార్యవర్గసభ్యుల సమిష్టి కృషితో, దాతల సహాయ సహకారాలతోనే ఈ ప్రశంసాపత్రం అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నాడు. వినాయకచవితి సందర్భంగా సంస్థ కార్యవర్గ సభ్యులంతా కలిసి ఈ ఆనందాన్ని పంచుకోవడం జరిగిందని ఆయన తెలిపాడు. సంస్థ ఉపాధ్యక్షుడు వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ యమహా సుబ్రమణ్యం, కోశాధికారి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు బాలయ్యనాయుడు, గ్రానైట్ ప్రభాకర్, కార్పొరేషన్ రవికుమార్, ప్రజేందర్‌రెడ్డి, శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కరిముల్లా, రామ్‌మోహన్‌రావు, తిరుమలరావు, ఉదయశేఖర్‌రెడ్డి, శ్యామ్, కో-ఆర్డినేటర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# శివారుల్లో వసతుల కల్పనకు కృషి



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

గూడూరు పట్టణ శివారు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే వరప్రసాదరావు అన్నాడు. పురపాలక సంఘంలోని జనార్ధన్ రెడ్డి కాలనీ, దోభి కాలనీ ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించాడు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నాడు. ఆయా కాలనీల్లో కనీస వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు అక్కడి ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.

ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యమిస్తామని, ఆయా ప్రాంతాల్లో సిసి రోడ్లు, మురుగు కాలువలు, వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని అన్నాడు. అనంతరం పట్టణంలోని ఎస్ఎంజి పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కూరగాయల మార్కెట్‌ను ఎమ్మెల్యే పరిశీలించాడు. వర్షమొస్తే అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోందని వ్యాపారులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఆయన వెంట పట్టణ సి.ఐ దశరధరామారావు, నాయకులు బొమ్మిడి శ్రీనివాసులు, మురళి, రమీజా తదితరులు ఉన్నారు.

# సేవాదృక్పథం అవసరం

**- సి.ఐ దశరథరామారావు**



గూడూరు పట్టణంలోని ప్రతి ఒక్కరూ సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలని పట్టణ సి.ఐ దశరథరామారావు అన్నాడు. గూడూరు సాయిరాం ఛారిటీస్, ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో సెల్వీ దాతృత్వంతో ఈనెల 24న వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల ఆకలి తీర్చేందుకు స్వచ్ఛంధ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడాడు. సంస్థ ప్రతినిధులు చంద్రశేఖర్ సురేంద్రనాథ్‌రెడ్డి, మస్తానయ్య, ప్రభాకర్, కరిముల్లా, సతీష్, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు వస్త్రాలు



రిహాబిలిటేషన్ అండ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో గూడూరులోని మెప్మా మరియు మై ఫ్రెండ్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న నిరాశ్రయుల గృహంలోని వృద్ధులు, దివ్యాంగులకు ఈ నెల 26వ తేదీ వస్త్రాలు మరియు భోజనాలు ఏర్పాటు చేశారు. కీర్తిశేషులు కొడవలూరు ప్రసాద్‌నాయుడు జ్ఞాపకార్థం వారి భార్య వసంత, కుమారుడు నిఖిల్ చక్రవర్తి కుటుంబసభ్యులు ఈ కార్యక్రమానికి దాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, శ్రీనివాసఆచారి, మై ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాహుల్ మరియు సభ్యులు పాల్గొన్నారు.

# జైట్లీ సేవలు ఎనలేనివి




కేంద్ర ఆర్థిక మంత్రిగా, రక్షణశాఖ మంత్రిగా దేశానికి అరుణ్‌జైట్లీ ఎనలేని సేవలందించారని బీజేపీ నాయకులు కొనియాడారు. ఈనెల 24వ తేదీ అరుణ్‌జైట్లీ వర్ధంతిని పురస్కరించుకుని బీజేపీ నాయకులు గూడూరు గడియారపు స్థంభం కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలకృష్ణమ నాయుడు, బైరప్ప, ప్రకాష్‌నాయుడు, బిందురెడ్డి పాల్గొన్నారు.

# నిరాశ్రయులకు భోజనం



ఈ నెల 24వ తేదీ ప్రముఖ ఆడిటర్ రామ్మోహన్‌రావు - రాజ్యలక్ష్మిల పెళ్ళిరోజు సందర్భంగా గమళ్ళపాళెంలోని మై ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెప్మా మరియు మునిసిపాలిటీ సౌజన్యంతో నిర్వహించబడుతున్న నిరాశ్రయుల వసతి గృహంలోని వారికి రాత్రి భోజనం, కోడిగుడ్లు, అరటిపండ్లు అందజేశారు.

# రైతులరా!.. దళారులను నమ్మి.. మోసపోకండి

**- జేసీ ప్రభాకర్‌రెడ్డి**

రైతులారా!..దళారులను నమ్మి, తక్కువ ధరకే ధాన్యం అమ్ముకుని నష్టపోకండి. దళారుల మాటలు నమ్మి మోసపోకండి. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు. మీరు పండించిన ప్రతి గింజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది".. అంటూ జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి జిల్లా రైతాంగానికి అభయమిచ్చారు.

ఈనెల 23న ఆయన నాయుడుపేటలో పర్యటించి పొలాల్లో ఉన్న ధాన్యం రైతుల వద్దకు వెళ్ళి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతుధర కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని, ధాన్యం పుట్టి రూ.15,597.50లు మద్దతుధర ఇచ్చేవిధంగా ప్రభుత్వం ఏర్పాటుచేసిందన్నారు. కనుక ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని చెప్పారు. రైతులు పండించిన ఏ రకం ధాన్యాన్నయినా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుందని, అందువల్ల తొందరపడి తక్కువ ధరకే మీరు దళారులకు ధాన్యం అమ్ముకోవద్దని చెప్పారు. ధాన్యం విక్రయాలపై రైతుసంఘాల వారితో పాటు మిల్లర్ల యజమానులతో కూడా తాను సంప్రదించానని, ప్రతి మండల కేంద్రంలోను ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశామని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు. ధాన్యంలో 17 శాతం నెమ్ము కన్నా ఎక్కువ ఉన్నా కొనుగోలు చేసేవిధంగా మిల్లర్లతో మాట్లాడామన్నారు. ప్రభుత్వం ఇటీవల ఏర్పాటుచేసిన రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రతి రైతుకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పంటల రక్షణకు కావాల్సిన సామగ్రి అంతా అందుబాటులో ఉంటుందని, రైతులు ఆ కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. తొలుత నాయుడుపేటలోని లోతువానిగుంట కాలనీలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జేసీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జేసీ వెంట ఆర్డీఓ సరోజిని, తహశీల్దార్ శ్రీనివాసులు, వ్యవసాయాధికారి వరప్రసాద్, పిఏసిఎస్ సిఇఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### పచ్చదనం వెల్లివిరిసేందుకు..

# ఒకటిన్నర లక్షల మొక్కలు పంపిణీ

**డిఎఫ్‌ఓ రవిశంకర్ వెల్లడి**

ఈ ఏడాది పొదలకూరు మండలంలోని ఇనుకుర్తి సెంట్రల్ నర్సరీలో ఒకటిన్నర లక్షల మొక్కలను పెంచుతున్నామని, వీటిలో లక్ష మొక్కలను జగనన్న పచ్చతోరణం కార్యక్రమానికి, ప్రభుత్వ లే-అవుట్‌లలో నాటేందుకు ఉచితంగా అందజేశామని సామాజిక అటవీశాఖ జిల్లా అధికారి ఎస్. రవిశంకర్ తెలిపారు. ఈనెల 23న ఆయన ఇనుకుర్తి నర్సరీలో నిర్మించిన కూలీల విశ్రాంతి గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నర్సరీ ద్వారా జిల్లాలోని 8 మండలాలకు పండ్ల మొక్కలు, నీడనిచ్చే మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని కావలి, కలువాయి, పొదలకూరు, చేజర్ల, రాపూరు, మనుబోలు, కలిగిరి, అనంతసాగరం మండలాలకు ఈ నర్సరీ నుంచి మొక్కలను ఉచితంగా పంపిణీచేస్తున్నట్లు చెప్పారు. రోడ్ల వెంబడి పచ్చదనం నింపేందుకు డ్వామా వారికి కూడా తాము మొక్కలు అందజేశామని తెలిపారు.

# చప్పగా.. చవితి వేడుకలు

- ఆడంబరాలు లేవు.. ఆర్భాటాలు లేవు
- ఇళ్లలోనే భక్తిశ్రద్ధలతో గణపయ్యకు పూజలు

***వినాయకచవితి అంటేనే వీధుల్లో పెద్దపెద్ద గణేశుని విగ్రహాలు, వీధంతా విద్యుద్దీపాలంకరణలు, పుష్పాలంకరణలు, వినాయకుని ప్రార్థిస్తూ హోరెత్తించే పాటలు, జై గణేశా!..జై జై గణేశా!..అంటూ పెద్దఎత్తున నామస్మరణలు, అరుపులు కేకలు సంబరాలు.. తప్పెట్లు తాళాలు, బాణసంచావేడుకలు.. అంతా మోత మోతగా ఉండేది. అయితే ఈ ఏడాది కరోనా ధాటికి జిల్లాలోనూ, ముఖ్యంగా నెల్లూరు నగరంలోనూ గణనాధుని పండుగ వెలవెలబోయింది. చవితి పండుగ ఆర్భాటాలు లేకుండానే చప్పగా సాగిపోయింది.***

అసలు వినాయకచవితి అంటేనే పెద్ద కోలాహలం. చిన్నా పెద్దా అందరూ ఎంతో సంబరంగా చేసుకునే పండుగ. వీధులన్నీ పెద్దపెద్ద మండపాల్లో.. రంగు రంగుల వినాయక విగ్రహాలతో కొలువుదీరి ఉండేవి. ఇప్పుడా కళ లేదు. ముందురోజే వినాయకునికి విశేష పూజలు చేసేందుకు పత్రిపుష్పాలు వగైరాలు అమ్మేవాళ్ళతో.. వీధుల్లో అంగళ్ళ వద్ద జనం కిటకిట లాడేవారు. వినాయకుని ప్రతిమలు, విగ్రహాల కోసం జనం ఎగబడేవారు. ఇప్పుడా సందడి లేదు. ఎవరికివారే గబ గభా కావాల్సిన పత్రి సామగ్రి దొరికిన కాడికి కొనుక్కుని ఇళ్ళకు వెళ్ళిపోయి విఘ్నేశ్వరునికి మొకరిల్లి ఎంతో భక్తితో పూజలు చేసుకున్నారు. కరోనా వ్యాధి విజృంభిస్తున్న నేపథ్యంలో ఎవరికి వారు స్వీయరక్షణలో పడ్డారు. అందుకే వీధుల్లో మునుపటి కోలాహలం ఇప్పుడు కనిపించ లేదు. వీధులన్నీ బోసి పోయి ఉంటున్నాయి. కనువిందుచేసే పెద్దపెద్ద గణేశ విగ్రహాలు కూడా ఈసారి జిల్లాలో ఎక్కడా కనిపించ లేదు. ఎక్కడ చూసినా చిన్నిచిన్ని మట్టిప్రతి మలే. అదే మహద్భాగ్యం అనుకుంటూ జనం ఆయా ప్రాంతాల్లోనే గణేశ ప్రతి మలు, పూలు పత్రి అన్నీ కొనుక్కుని ఇళ్ళలోనే పిల్లలు, పెద్దలతో కలిసి పూజలు చేసుకున్నారు. అందరూ ఇళ్లలోనే ఉండ డంతో అందరితో కలిసి ఈ పండుగ చేసుకోవడం ఒక అదృష్టమే. చేయదలచు కున్న పిండివంటలన్నీ చేసుకుని వినాయ కునికి పూజలు చేసి నైవేద్యం పెట్టుకున్నారు.



### ఆలయాల్లోనూ ఏకాంతంగా పూజలు :


ఆలయాల్లోనూ గణపయ్యకు ఏకాంతం గానే పూజలు జరిగాయి. నెల్లూరు నగ రంలో అనేకచోట్ల ఉన్న వినాయకుని గుళ్ళలో విఘ్నేశ్వరునికి విశేష పూజలు జరిగాయి. అక్కడక్కడా కొద్దిమంది భక్తులు మాస్కులు ధరించి, భౌతికదూరం పాటిస్తూ వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పూజలు జరిగిన తర్వాత స్వామివారికి అంగరంగ వైభవంగా జరిగే నిమజ్జనోత్స వాలు కూడా నిరాడంబరంగానే జరి గాయి. ఎవరికి వారు తాము పూజలు చేసిన వినాయకుని మట్టిప్రతిమలను పెన్నానదిలోనూ, చెరువులోనూ నిమజ్జనం చేశారు. ఈసారి కరోనా దెబ్బతో వినాయక విగ్రహాలు తయారుచేసేవారు, లైటింగ్‌లు ఏర్పాటు చేసేవారు, పాటకచ్చేరీలు చేసే వారు.. అందరికీ నిరాశే మిగిలింది. వీరికి ఈసారి డిమాండ్ లేకపోవడంతో వారి జీవనోపాధికి ఇబ్బంది ఏర్పడింది.

# డిఆర్‌ఓ రమణ.. బాధ్యతల స్వీకరణ



కొత్త డిఆర్‌ఓగా నియమితులైన ఎంవి రమణ ఈనెల 24న నెల్లూరు లోని కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీక రించారు. జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్‌ఓ)గా ఇక్కడ పనిచేస్తున్న మల్లికార్జున టిటిడి ఎస్టేట్ ఆఫీసర్‌గా బదిలీ కావడంతో ప్రభుత్వం ఎంవి రమణను ఆ స్థానంలో నియమించింది. ఎంవి రమణ గతంలో జిల్లాలోని ఆత్మకూరు ఆర్డీఓగా, ఇన్‌చార్జి డిఎస్‌ఓగా కూడా పనిచేశారు. డిఆర్‌ఓగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన గౌరవపూర్వకంగా జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబును కలుసుకున్నారు.

---



### కోరిన వరాలిచ్చే కొండంత దేవుడు

# కొండ బిట్రగుంట... శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుడు

***భక్తుల కొంగుబంగారంగా, కోరిన వరాలిచ్చే కొండంత దేవునిగా కొండ బిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరుడు ఎంతో ప్రసిద్ధి. ప్రాచీనకాలం నుంచీ ఈ ఆలయం ఉంది. పురాణకాలంలో నారద మహర్షి ఈ ప్రాంతంలో తపస్సు చేసి, ఇక్కడ మహావిష్ణువును ప్రత్యక్షం చేసుకున్నాడని, అందువల్లనే అనాదిగా ఈ ఆలయం ఎంతో మహిమాన్వితమైనదిగా ప్రసిద్ధిచెందిందని ప్రతీతి.***

**మన దేవాలయాలు (10)**

కొండ బిట్రగుంట ప్రసన్న వేంక టేశ్వరుని ఆలయం జిల్లాలో ఎంతో పురాతనమైనది. ప్రసిద్ధమైనది కూడా. బోగోలు మండలంలోని కొండ బిట్ర గుంట గ్రామంలో కొండమీద వెలసివున్న ఈ ఆలయం సుప్రశాంత ఆధ్యాత్మిక వాతావరణంలో అలరారుతూ ఉం టుంది. ఆలయం వద్ద ఎత్తయిన రాజ గోపురం, ఆలయం వద్దకు వెళ్ళేందుకు చక్కని మెట్లు, చుట్టూ పచ్చని ప్రకృతి వాతావరణం కనువిందు చేస్తుంటాయి. నెల్లూరుకు సుమారు 50 కిలోమీటర్ల దూరంలో, కావలికి 15 కిలోమీటర్ల దూరంలో, బిట్రగుంట నుంచి 3 కిలో మీటర్ల దూరంలో వెంకటేశ్వరపాళెం రైల్వేస్టేషన్‌కు కేవలం ఒక్క కిలో మీటరు దూరం లోనే ఈ ఆలయం ఉంది. ఈ ఆలయాన్ని దర్శించుకోవడానికి అటు రైలు మార్గం, రోడ్డు వసతి, ఆటోల సదుపాయం కూడా ఉంది.

### నాటి బిలకూట క్షేత్రమే.. నేటి కొండ బిట్రగుంట :

పురాణ కథనాల ప్రకారం.. నారద మహర్షి శ్రీమహావిష్ణువును ప్రత్యక్షం చేసుకునేందుకు ఈ కొండమీద ఎంతో కాలంగా తపస్సు చేశాడు. నారదుని తప స్సుకు మెచ్చిన మహావిష్ణువు ప్రత్యక్షమై నారదుడిని వరం కోరుకోమంటాడు. ఇక్కడ అర్చారూపం(విగ్రహరూపం)లో వెలసి లోకకల్యాణం గావించాలని, భక్తులను అనుగ్రహించాలని నారదుడు శ్రీమహా విష్ణువును కోరుకుంటాడు. దీంతో భక్తవత్స లుడైన మహావిష్ణువు లక్ష్మీదేవి సమేతుడై శ్రీ ప్రసన్న వేంకటేశ్వరునిగా ఇక్కడ వెలసి నట్లు చెప్తుంటారు. నారదుడు తపస్సు చేసిన ప్రదేశమే ఈ బిలకూట క్షేత్రంగా, నారద మహర్షిచే ప్రతిష్ఠితమైన స్వామివారిగా శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుడు ప్రసిద్ధి. అం దుకు తగ్గట్టుగానే ఎంతో కాలం నుంచి ఈ ఆలయం దక్షిణ భాగంలో ఒక బిలం ఉంది. ఆ బిలమే నారదమహర్షి తపస్సు చేసిన చోటని అంటుంటారు.

### గౌరమాంబాదేవి కట్టిన ఆలయం

ఆ తర్వాత దాదాపు ఆరు శతాబ్దాల క్రితం ఉదయగిరిని రాజధానిగా చేసుకుని ఈ ప్రాంతాన్ని పాలించిన గజపతుల ఆడపడుచు గౌరమాంబాదేవి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామికి ఈ అత్యద్భుతమైన ఆలయాన్ని కట్టించిందని ఆలయ చరిత్ర చెప్తోంది. ఈ కొండకు దిగు వన కొద్ది దూరంలోనే ఉన్న 'గౌరవరం' అనే గ్రామం కూడా ఈ గౌరమాంబ పేరు మీదనే ఏర్పడిందని, విష్ణుభక్తురాలైన గౌర మాంబ ఆజన్మబ్రహ్మచారిణిగా ఉంటూ నిత్యం దైవారాధనలోనే తరించేదని అం టారు. ఆమె అద్వితీయమైన దైవభక్తికి ప్రతీకగా ఈ ఆలయం నేటికీ ఎంతో వైభ వంగా ఉంది. నాటి గజపతులు పాలిం చిన ఈ ప్రాంతంలో వారు తవ్వించిన ఒక పెద్ద కోనేరు శ్రీవారి పుష్కరిణిగా.. కొండ కింద ఈశాన్యభాగంలో ఇప్పటికీ ఉంది. ఆ తర్వాత కాలంలో ఇక్కడ రాజ గోపురాన్ని మరో భక్తురాలెవరో నిర్మించి నట్లు స్థానికుల కథనం. కానీ ఆ భక్తురా లెవరో వివరాలు తెలియరావడం లేదు. దూరం నుంచే 'అదిగో కొండ బిట్రగుంట' అని అందరూ గుర్తించే విధంగా ప్రజల నుంచి విరాళాలు పోగుచేసి కొండ మీద ఎత్తయిన రాజగోపురాన్ని ఆమె నిర్మించి ఆలయానికి మరింత ప్రఖ్యాతిని తీసుకు రావడం గొప్ప విశేషం.

కొండమీద శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంతో పాటు లక్ష్మీ అమ్మవారి ఆలయం, సంతాన కృష్ణుని ఆలయం, శ్రీ ఆంజనేయస్వామి గుడి, ఆళ్వారుల సన్నిధి వగైరాలున్నాయి. ప్రతి ఏటా ఫాల్గుణ మాసం శుద్ధ దశమిరోజు నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు వైష్ణవ సంప్రదాయం ప్రకారం ఎంతో వైభవోపేతంగా జరుగుతుంటాయి. ఈ బ్రహ్మోత్సవాలకు పెద్దసంఖ్యలోనే భక్తులు తరలి వస్తుంటారు. సంతానం లేని భక్తులు ఇక్కడికి వచ్చి సంతాన కృష్ణునికి మొక్కుకుంటే సంతానప్రాప్తి కలుగుతుంది.

సాక్షాత్తూ కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుడే.. ఇక్కడ ప్రసన్న వేంక టేశ్వరునిగా వెలసి ఉన్నాడా అన్నంత కళగా ఉంటుంది స్వామివారి సుందర రూపం. శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుడు పేరుకు తగ్గట్టుగానే ప్రసన్నమూర్తి.. భక్త వరదుడు!.. స్వామి వారిని ఆరాధించే భక్తులకు సకల శుభాలు కలుగుతా యని.. కోరిన కోరికలు నెరవేరుతాయని వేరే చెప్పనక్కర లేదు.

వీక్షణం - మంజీర

# కొత్త జిల్లాలతో... నెల్లూరుకి మిగిలేది?

ఇద్దరు ఆంధ్రావాళ్లు అమెరికాలో కలుసుకున్నప్పుడు 'ఇద్దరం తెలుగు వాళ్లం' అని సరిపెట్టుకోరు. మరికొంత దగ్గర తనం కోసం 'మీరెక్కడ' అని మరో ప్రశ్నను సంధిస్తారు. ఒకవేళ ఇద్దరూ కనుక ఒకే జిల్లా వాళ్లయితే ఆ ఇద్దరి మధ్య స్నేహ బీజం పడిపోయిందన్నమాటే. ఇరుగు పొరుగు జిల్లాలైతే 'ఒకరికొకరం దగ్గరి వాళ్లమే సుమా' అన్నట్లు స్నేహసుమాలు పంచుకుంటారు. అయితే ఇకపై 'మనం మనం బరంపురం' అనుకునే ముందు జిల్లా భౌగోళిక పటాన్ని గుర్తు చేసుకోవాలి. ఇప్పటి నెల్లూరోళ్లందరం ఇకపై నెల్లూరోళ్లం కాదు. కొందరం బాలాజీ వాళ్లం కూడా. నెల్లూరంటే సమృద్ధిగా సాగునీరు, సస్యశ్యామలమైన పంటలున్న నేల... అనే మాట ఇకపై పాక్షిక వాస్తవం మాత్రమే. మెట్ట ప్రాంతమైన కందుకూరు కూడా ఇకపై మనదే. ఇది ప్రస్తుతం ప్రకాశం జిల్లా.

## ఇవన్నీ బాలాజీవే...

పులికాట్ సరస్సు మనది కాదు, శ్రీహరికోట షార్ సెంటర్ నెల్లూరు జిల్లాలో ఉండదు. నేలపట్టు పక్షుల విహార కేంద్రానికి పెలికాన్‌లు వస్తాయి. కానీ ఫ్లెమింగో ఫెస్టివల్ మనం చేసుకోలేం. నిప్పో ఫ్యాక్టరీ, తడ జలపాతం(సిద్దలయ్యకోన) కూడా పొరుగు జిల్లావే. కృష్ణపట్నం పోర్టు 'నేను వేరు మీరు వేరు' అన్నట్లు కవ్విస్తుంటుంది. శ్రీసిటీ కూడా 'సిరి' ఎప్పుడూ బాలాజీ సొంతమే కదా అంటుంది. కందుకూరు, కావలి, ఆత్మకూరు, కోవూరు, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గాలు నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గంలో భాగం. ఇకపై ఇదీ మన జిల్లా స్వరూపం. సర్వేపల్లి, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట... ఇకపై మనవి కావు.

### బాలాజీ ఇక కోస్తా దేవుడు

మన రాష్ట్రంలో ఉన్న పాతిక నియోజకవర్గాల్లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అమలాపురం, నర్సాపురం, మచిలీపట్నం, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి... మొత్తం పన్నెండు నియోజకవర్గాలు బంగాళాఖాతం తీరం వెంబడి ఉన్నాయి. మారే జిల్లాల ముఖచిత్రంలో తిరుపతి నియోజకవర్గం బాలాజీ జిల్లాగా రూపొందితే... ఇక తిరుమల శ్రీవేంకటేశ్వరుడు కోస్తా దేవుడే. నెల్లూరు జిల్లాను అడ్డంగా కోసేసి మరీ పుట్టుకొస్తున్న జిల్లా కొత్త కోస్తా జిల్లా బాలాజీ జిల్లా. బంగాళాఖాతం తీర నియోజకవర్గాలు పోగా మిగిలినవి... అరకు, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నర్సరావుపేట, నంద్యాల, కర్నూలు, అనంతపూర్, హిందూపూర్, కడప, రాజంపేట, చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గాలు. ఇవి యథాతథంగా జిల్లాలుగా మారినా కూడా వాటికి ఉన్న ప్రాంతీయతలో ఎటువంటి మార్పు ఉండదు. మార్పు తప్పని పరిస్థితి ఒక్క వేంకటేశ్వరుడికే వచ్చింది.

## విభజన షురూ

పై ఉపోద్ఘాతం ఎందుకంటే... ఆంధ్ర ప్రదేశ్‌లో జిల్లాల పునర్విభజన ప్రక్రియ మొదలైంది. పదమూడు జిల్లాల ఆంధ్రప్రదేశ్‌లో ఇకపై పాతిక లేదా మరొకటి ఎక్కువగా ఉండనున్నాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సహాని ఈ మేరకు జీవో కూడా విడుదల చేశారు. ఆ సమావేశంలో జిల్లాల విభజన సమాచారం కోసం ఒక పోర్టల్ ఏర్పాటు, మ్యాప్‌లు, సరిహద్దులు, న్యాయపరమైన సమస్యలు, జిల్లాల మధ్య ఆస్తుల పంపకం, ఉద్యోగుల పంపకం, మౌలిక సదుపాయాల వంటివన్నీ చర్చకు వచ్చాయి. జిల్లా పాలన మొత్తం ఏరియల్ వ్యూలో చూసినట్లు విధాన నిర్ణయాలు జరిగిపోతున్నాయి. కానీ నేల మీద నిలబడిచూస్తే తప్ప అర్థం కాని కనీస విషయాలు, ఒక సామాన్యుడి అవసరాలు మాత్రం చర్చకు నోచుకోవడం లేదు. మన రాష్ట్రంలో లోక్‌సభ నియోజకవర్గాలు పాతిక ఉన్నాయి. వాటిని యథాతథంగా జిల్లాలుగా ప్రకటిస్తే సరిపోతుందనే అభిప్రాయం పాలకుల నోటి వెంట ఏడాది కిందటే వచ్చింది. విభజనకు లోక్‌సభ నియోజకవర్గమే ప్రధాన ప్రాతిపదిక అయితే పరిపాలన సామాన్యుడికి దూరం కావడం తప్ప సాధించే ప్రయోజనం ఏమీ ఉండదు. పాలన సౌలభ్యం కోసం చిన్న జిల్లాల ఏర్పాటు అనే మాట ఎండమావే.

## వంద కిలోమీటర్ల దూరమా!

జిల్లా కేంద్రం అంటే... ఆ జిల్లా సరిహద్దులో ఉన్న గ్రామానికి కూడా అందుబాటులో ఉండాలి. రాజకీయ బలం లేని ఒక సామాన్యుడు తన సమస్యను కలెక్టర్‌కు విన్నవించుకోవాలన్నా, అండదండా లేని ఓ మహిళ అత్తింటి ఆరళ్లను జిల్లా ఎస్పీకి ఏకరువు పెట్టుకోవాలన్నా జిల్లా కేంద్రానికి రావాల్సిందే. వాళ్ల ఊర్లో తొలి బస్సు పట్టుకుని ఉదయం పదిగంటలకంతా జిల్లా కేంద్రానికి చేరుకోవాలి. తమవంతు కోసం క్యూలో నిలబడి కలెక్టర్, ఎస్పీలను కలిసి న్యాయం చేయమని వేడుకుని తిరిగి సొంతూరు బాట పట్టాలి. కనీసం వాళ్ల ఊరికెళ్లే చివరి బస్సునైనా అందుకుని ఇల్లు చేరుకోగలగాలి. ఇప్పుడు మన ఎదురుగా ఉన్న విభజన ప్రక్రియ ప్రకారం నెల్లూరు పట్టణానికి పది కి.మీల దూరంలో ఉన్న ముత్తుకూరు వాళ్లు తిరుపతికి వెళ్లాలి. ఎందుకంటే వాళ్లు సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందుతారు, అది తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది కాబట్టి. ఇక నెల్లూరు పట్టణానికి నూట పది కిలోమీటర్ల దూరాన ఉన్న కందుకూరు వాళ్లు నెల్లూరుకు రావాలి. ఇది ఎవరికి సౌకర్యం? ఎవరి సౌలభ్యం కోసం ఇలాంటి విభజన?

## నెల్లూరుకు మిగిలేవి ఇవి

పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అనే పేరు మాత్రం ఇకపై కూడా నెల్లూరుదే. ఎందుకంటే శ్రీరాములు పుట్టిన జువ్వలదిన్నె గ్రామం నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గంలోనే ఉంది. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం, ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం పోరాడి ప్రాణాలు వదిలిన త్యాగమూర్తి ఎప్పటికీ నెల్లూరు వాడే. తిక్కన పుట్టిన పాటూరుకు కూడా కొత్త పొట్లేవీ రావడం లేదు కాబట్టి తిక్కనకు కూడా జిల్లా మారాల్సిన ఇక్కట్లు లేవు. పెన్నా తీరం మాత్రం ఎటువంటి పరిహాసం చేయడం లేదు. సంతోషం. ప్రక్రియ దాదాపు పూర్తయినట్లే. ఇక జరగాల్సింది కొత్త జిల్లాల భౌగోళిక సరిహద్దులను సూచించే మ్యాపులతో అధికారికంగా గెజిట్ విడుదల కావడమే. ఇలాగే విభజిస్తే... అధికారులు విభజన ప్రక్రియను సులువుగా చేసేయాలనుకుని భవిష్యత్తులో పాలన ప్రక్రియను సంక్లిష్టం చేసుకోవడమే అవుతుంది.

# ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి

**- అధికారులతో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య**



ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని, ప్రజా అవసరాల దృష్ట్యా వాటిని ధర్మబద్ధంగా కాపాడుకోవాలని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చెప్పారు. ఈనెల 25న ఆయన నాయుడుపేటలో జరిగిన రెవెన్యూ, మునిసిపల్ అధికారుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల వద్దకు పాలనను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రభుత్వ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేవిధంగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు వగైరాలన్నీ ఏర్పాటుచేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ స్థలాలను ఈ కార్యాలయాల కోసం కేటాయించాలని అధికారులకు సూచించారు. నాయుడుపేట మునిసిపాల్టీ ప్రాంతంలో పలు చోట్ల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని తెలుస్తోందని, వాటిని స్వాధీనం చేసుకుని ఆ స్థలాలు మళ్ళీ ఆక్రమణలకు గురికాకుండా కంచెలు ఏర్పాటుచేయాలని సూచించారు. ఆక్రమణదారులు ఎంతటివారైనా సరే ఉపేక్షించవద్దన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, జనార్దన్‌రెడ్డి, 786 రఫీ, కిషోర్‌యాదవ్, కామిరెడ్డి రాజారెడ్డి, కురుగొండ ధనలక్ష్మి, కటకం జయరామయ్య, బైనా మల్లికార్జునరెడ్డి, చంద్రారెడ్డి, రవీంద్ర, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డు కుటుంబాలకు చెక్కులు



ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు హోంగార్డుల కుటుంబాలను ఆదుకుంటూ, బాధిత కుటుంబసభ్యులకు 5 లక్షల వంతున ప్రమాద బీమా చెక్కులను ఈనెల 26న జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ అందజేశారు. అదేవిధంగా జూన్‌లో ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు రమణమ్మకు 4,16,060 రూపాయల చెక్కును అందించారు. అడిషనల్ ఎస్పీ వెంకటరత్నం, హోంగార్డ్స్ డిఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు, అధికారులకు పురస్కారాలు

జిల్లాలో కరోనా వ్యాధి నిరోధానికి నిరంతరం శ్రమిస్తున్న పలువురు వైద్యులు, అధికారులకు ప్రశంసాపత్రాలు లభించాయి. ఆగస్టు 15న స్వాతంత్ర్యదినోత్సవం నాడు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు వారి సేవలను అభినందిస్తూ ప్రతిభా పురస్కారాలను ప్రకటించారు. కరోనా నిబంధనల నేపథ్యంలో ఆ ప్రశంసాపత్రాలను ఆరోజు ఇవ్వకుండా ఈనెల 26న డిఎంహెచ్‌ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి కార్యాలయానికి పంపగా, ఆమె వాటిని ఆయా వైద్యులు, అధికారులకు అందజేశారు. అడిషనల్ డిఎం అండ్ హెచ్ఓ స్వర్ణలత, ఎంఓటి అధికారి డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ వెంకటప్రసాద్, పిఓడిటి డాక్టర్ ఉమామహేశ్వరి, కావలి డివిజన్ ప్రోగ్రామ్ అధికారి డా. విజయకుమార్, గూడూరు డివిజన్ ప్రోగ్రాం అధికారి డా. అచ్యుతకుమారి, డా. మొయిన్, స్టాటిస్టికల్ ఆఫీసర్ భాస్కర్, రిషిలకు ఈ ప్రశంసాపత్రాలందజేసి అందరినీ అభినందించారు.

## కొత్త చిగుళ్ళు

ఇది విషాదం పులుముకొన్న ధాత్రి
ఆనంద సమయాలు ఆవిరై
నీలినీడలు పరుచుకొన్న ప్రపంచం
అంతా ఓ శవాగారమై సాక్షాత్కరిస్తున్న వేళ
ఎటుచూసినా దైన్యం నింపుకొన్న కళ్ళు
ఇక్కడ పలకరించుకొనేవన్నీ
బ్రతికున్న శవాలే
ఇదో శవాల జాతర
గుండెనిండా హాయిగా ఊపిరిపీల్చుకొని
ఎన్నాళ్ళయింది?
కళ్ళల్లో నవ్వులు పులుముకొని
ఎన్నాళ్ళయింది?
క్షణ క్షణం భయవిహ్వలమై
సంచరించడం తప్ప ఏమున్నదిక్కడ
ఇంతకంటే ప్రపంచానికి
మరణం మరొకటుంటుందా?
మనిషి ప్రశాంతంగా నిష్క్రమించడానికి
స్థలం కరువైన దయనీయం
నిరంతర గుండెకోతతో మనిషి
ప్రతి ఇంటినీ మృత్యవొకటి
పహారా కాస్తున్నది
దేశమంటే శవాలు, సమాధులు
అని నినదించాల్సి వస్తున్నది
ఈ దుర్భర నిశీధిని దాటి
ఎలాగూ బ్రతకలేం
బ్రతికినా జీవచ్ఛవాలం
ఏ జ్వరం రాకాసి ఎక్కడ పొంచి ఉందో..
ఏ ఊపిరి ఎక్కడ నియంత్రించబడుతుందో
ఊహకందని విషాదాన్ని మోస్తూ
ఎన్నాళ్లో... ఎన్నేళ్లో
మనుషులంతా
మోడుబారిపోయాక
కొత్త చిగుళ్ళు
మొలకలెత్తాలేమో!



- చిన్ని నారాయణరావు
9440202942

# కోలుకుంటున్న బాలు

(మొదటి పేజీ తరువాయి)

అన్ని భాషలలో తన గాత్రాన్ని వినిపించిన అసమాన ప్రతిభాశాలి, తన సుమధుర స్వరంతో సకల దేవతలను కొలుస్తూ స్వరార్చన చేసిన పుణ్యాత్ముడు యస్.పి.బాల సుబ్రహ్మణ్యం చెన్నై, యంజియం ఆసుపత్రిలో కోలుకుంటున్నాడు. ఆగష్టు 5వ తేదీన కరోనా కారణంగా ఆసుపత్రిలో చేరిన అయన ఆరోగ్యం 13 తేది నుండి విషమించిన విషయం అందరికీ విదితమే.

ఆయనకు క్రిటికల్‌గా ఉందని తెలిసిన మరుక్షణం నుండి కుల, మత, వర్గ, వర్ణ తారతమ్యాలు లేకుండా యావత్ ప్రపంచమంతా విస్తరించి వున్న సంగీత కుటుంబం ఆయనకోసం పూజలు, ప్రార్ధనలు, హోమాలు, దీక్షలు, వ్రతాలు చేస్తున్నారు. మా గాన గంధర్వుడిని మాకందించు భగవంతుడా.. కావాలంటే మా ఆయుష్షు కొంత తీసుకో... అంటూ వేలాదిమంది ఆయన అభిమానులు దైవాన్ని వేడుకుంటున్నారు.

దేవుడు కఠినాత్ముడు కాదు, అందరి మొరనూ ఆలకిస్తున్నాడు, అందరి పూజలు అందుకుంటున్నాడు, అందరి అభీష్టాన్ని గమనిస్తున్నాడు, మద్రాసులోని యంజియం ఆసుపత్రిలోని వైద్యుల రూపంలో నిరంతరం శ్రమిస్తున్నాడు. మన బాలు ఆరోగ్యాన్ని నెమ్మదిగా పురోగమనం వైపు నడిపిస్తున్నాడు.

మరికొన్ని దశాబ్దాల కాలం నీ సుస్వరాన్ని సంగీత అభిమానులకు ఒక వరంగా అందించమంటున్నాడు. పూజలు ఫలిస్తున్నాయి, ప్రార్ధనలు ఫలితాలిస్తున్నాయి. ఆయన కోలుకుంటున్నాడు. మన బాలు, మన సంగీత మణి పరిపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే తిరిగిరావాలని మనమూ ఆ భగవంతుడిని వేడుకుందాం.

## వాకబు చేస్తున్న వెంకయ్య...

భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు బాలు ఆరోగ్యం పట్ల తరచూ వాకబు చేస్తూ ఎప్పటికప్పుడు క్షేమ సమాచారాన్ని తెలుసుకుంటున్నాడు. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న తరుణంలో శరీరంలోని అవయవాలను ఉత్తేజపరచే "లోకోమాట్" అనే ప్రత్యేక వైద్య పరికరం అవసరమని, ఇప్పటికిప్పుడు దానిని కొనుగోలు చేసినా, అది రావడానికి కనీసం 4 వారాలు పడుతుందని, దక్షిణ భారతదేశంలో ఒక్క చెన్నై అపోలో ఆసుపత్రిలో మాత్రమే ఆ పరికరం ఉందని వైద్యులు చెప్పడంతో, తక్షణమే స్పందించిన ఉపరాష్ట్రపతి అపోలో ఛైర్మన్ ప్రతాప్ సి రెడ్డితో మాట్లాడి అపోలో నుండి ఆ వైద్య పరికరాన్ని యంజియంకు రప్పించడానికి ఒప్పించాడు. మన తెలుగువాడు, ముఖ్యంగా మన నెల్లూరు ఆణిముత్యం బాలుని కాపాడుకోవడంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాడు మన వెంకయ్యనాయుడు.

## నాన్న క్షేమం - యస్.పి.చరణ్

బాలు కుమారుడు చరణ్ కూడా ఎప్పటికప్పుడు తన తండ్రి క్షేమ సమాచారాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా బాలు అభిమానులకు తెలియచేస్తున్నాడు. నాన్న కోలుకుంటున్నాడని సైగలతో మాట్లాడే ప్రయత్నం చెయ్యడంతో పాటు రాసే ప్రయత్నం కూడా చేశాడని, ఆయన ఆరోగ్య పురోగతి సంతృప్తికరంగా ఉందని త్వరలోనే మళ్ళీ మన మధ్యకు వస్తారని చరణ్ వీడియో సందేశం ద్వారా చెప్పాడు. తన తండ్రి సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ప్రపంచవ్యాప్తంగా ప్రార్థిస్తున్న బాలు అభిమానులకి, సంగీత కళాకారులకి, సినీ ప్రముఖులకు, మీడియా మిత్రులకు, తన నాన్నను కంటికి రెప్పలా కాపాడుతున్న యంజియం ఆసుపత్రి డాక్టర్లకు ఆయన కృతజ్ఞతలు తెలుపుతూనే వున్నాడు.

# మన సతీష్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

మరో రెండేళ్లు పొడిగించింది. నెల్లూరు జిల్లా ఆత్మకూరు ప్రాంతంలోని మహిమలూరు గ్రామంలో అతి సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన సతీష్‌రెడ్డి తన అసామాన్య ప్రతిభాపాటవాలతో డిఆర్‌డిఓ ఛైర్మన్ స్థాయికి ఎదిగాడు.

'నాయనా.. నువ్వు బాగా చదుకోవాల, మన ఊరికి మన దేశానికి మంచిపేరు తీసుకోరావాల' అని తన కన్నతల్లి రంగమ్మ ఇచ్చిన ప్రోత్సాహమే ఆయనకు స్ఫూర్తి.

తన కన్నతల్లిని అయన ఎంతగా ప్రేమిస్తాడో తన దేశాన్ని, తాను పుట్టిన గ్రామాన్ని కూడా ఆయన అంతగా ఆరాధిస్తాడు. తాను ఏ హోదాలో ఉన్నా తరచూ స్వగ్రామానికి వస్తుంటాడు, తనవాళ్లందరిని పలకరిస్తుంటాడు.

తాను డిఆర్‌డిఓ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ఎన్నో ప్రయోగాత్మక ప్రయత్నాలతో రక్షణరంగాన్ని బలోపేతం చేస్తున్నాడు. కరోనా కష్టకాలంలో కూడా తాను సైతమంటూ ఢిల్లీలో వెయ్యి పడకల ఆసుపత్రిని అతి ఎక్కువ వసతులతో అత్యంత తక్కువ సమయంలో నిర్మించి ప్రారంభింపచేశాడు.

ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టే ప్రజాప్రయోజనాల పథకాలలో ఎక్కడ అవకాశం వుంటే అక్కడ రక్షణ పరిశోధనా సంస్థ తన పాత్ర తప్పక పోషించేలా చూస్తాడాయన.

ఇప్పుడు కూడా 'ఆత్మ నిర్భర్ భారత్'లో భాగంగా చిన్న మధ్య తరగతుల పరిశ్రమలకు ఊతంగా నేటి యువతకు అండగా ఉండాలనే సంకల్పంతో రక్షణ విభాగంలో ఉప యోగపడే 108 సైనిక రక్షణ వ్యవస్థలను, ఉప వ్యవస్థలను అత్యున్నత స్థాయి బృందం పర్యవేక్షణలో రూపొందించి రక్షణమంత్రి రాజనాథ్‌సింగ్‌కు సమర్పించాడీ యువ మహిమలూరు మేధావి. అబ్దుల్ కలాం వంటి మహా మేధావుల బాటలో నడుస్తూ అంచెలంచెలుగా ఎదుగుతున్న మన సతీష్‌రెడ్డి భారతదేశంలో అత్యున్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షిద్దాం.!

# కాంగ్రెస్‌కి 'కరోనా'

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చుకుని, ఆ రాజీనామాని తనకు తానే తిరస్కరించుకుని, ఈ సమస్యని ఆరు నెలలు వాయిదా వేద్దాం అని ఆమే నిర్ణయించి సమస్యను క్వారంటైన్‌కి పంపేసింది.

ఆమెకు అసలే ఆరోగ్యం బాగాలేదు. ఇలాంటి సమయంలో ఈ లేఖల భాగోతం ఆమెకు పెద్ద తలనొప్పే. అయితే పార్టీ నేతలు రెండువర్గాలుగా విడిపోవడం, సీనియర్లు జూనియర్లు కలగలసిన ఒక వర్గం ఎక్కువ శాతం సోనియాగాంధీకే జై కొట్టడంతో సమస్య తాత్కాలికంగా గట్టెక్కింది.

కాంగ్రెస్‌పార్టీని తమ గుప్పిట్లో పెట్టుకుని తిరుగులేని వ్యక్తులుగా పెత్తనం చెలాయిస్తున్న గాంధీ కుటుంబం ఈ పరిణామంతో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పార్టీ అధ్యక్షురాలు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తరుణంలో నాయకత్వ మార్పుపై దుమారం రేగడం యువ రాజు రాహుల్‌కి కోపం తెప్పించింది.

ఇప్పటికే కనుమరుగైపోయే పరిస్థితులలో పార్టీ దీనావస్థలో ఉంటే ఇలా చేయడం ఏంటి, ప్రతిపక్షపార్టీకి బలం చేకూర్చడానికి ఈ పని చేశారా అంటూ నోరు జారడంతో సీనియర్లకు ఇంకా రేగింది.

## పార్టీ నాయకత్వ భవిష్యత్తు ప్రశ్నార్థకమే...

తాత్కాలికంగా సమస్య సద్దుమణిగినా కాంగ్రెస్ పార్టీ నాయకత్వ భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఒక్కొక్కటిగా రాష్ట్రాలు తమ చేయి జారిపోవడం, పార్లమెంటులో సీట్లు గణనీయంగా పడిపోవడం, యువ నాయకుడిగా రాహుల్ జనాదరణ పొందలేక పోవడం, పార్టీని నిలబెట్టడానికి ప్రియాంకా చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడం వంటి అంశాలు, కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని తమ రాజకీయ భవిష్యత్తుకు ప్రణాళికలు వేసుకున్నవారికి మింగుడుపడడం లేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆంధ్రాలో లాగా దేశం మొత్తంలో పార్టీ భూస్థాపితం కావడం తథ్యం అన్నది వారి అంచనా.

## కుటుంబ పార్టీ.. అనే ముద్ర చెరిగిపోవాలి

ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి నిజంగానే నాయకత్వ మార్పు అవసరం. కుటుంబ పార్టీ అనే ముద్ర చెరిగిపోతే తప్ప ఆ పార్టీ మళ్ళీ కోలుకోవడం గగనమే. భవిష్యత్తును ముందే గ్రహించిన రాజకీయ కురువృద్ధులు మేల్కొన్నారు, నాయకత్వ మార్పుపై సర్మగర్భంగానే స్పందించారు. కానీ భజనపరులు మాత్రం మళ్ళీ ఆ కుటుంబాన్నే బలపరిచారు. ప్రస్తుతానికి ఈ అసమ్మతి కరోనాకు ఆరు నెలల విరామం ప్రకటించి ప్రస్తుతానికి తాత్కాలికంగా క్వారంటైన్‌కి పంపారు. ఆ తర్వాతైనా ఏమవుతుందో?! చూద్దాం ఏం జరుగుతుందో?!

# అవినీతి అంతు చూద్దాం!

(మొదటి పేజీ తరువాయి)

'అవినీతీ నీవెక్కడున్నావు అంటే.. నేను సర్వాంతర్యామిని' అన్నట్లుగా అవినీతి అంతటా వ్యాపించి ఉంది.

ఎక్కడ చూసినా అవినీతే తాండవిస్తోంది! అయితే, ఏ కొన్నిచోట్లలోనో, ఏ కొద్దిమందో అవినీతి మకిలి అంటని మహానుభావులు కూడా లేకపోలేదు. కానీ దురదృష్టం.. అలాంటి వారి సంఖ్య చాలా స్వల్పంగానే ఉంటుందని వేరే చెప్పనక్కర లేదు. ప్రతి చిన్నపనికీ బల్లకింద చేతులు చాచే లంచావతారులకు కొదవ లేని మన సమాజంలో, అందిన కాడికి జవురుకోవడమే ధ్యేయంగా పనిచేసే వారి సంఖ్యే అధికం అన్న సంగతి అందరికీ తెలిసిందే. ఎన్నికోట్లు అక్రమంగా సంపాదించినా ఇంకా ఇంకా సంపాదించాలనే యావతో కోటానుకోట్లరూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టిన ఘనులెంతోమంది ఉన్నారు. అలాంటి వారు ఏసిబి అధికారుల వలకు చిక్కిపోయిన ఘటనలు కోకొల్లలు. అయినా, అవినీతివరులు, లంచావతారులు మారడం లేదు. ఎంతమందిని పట్టుకున్నా ఇంకా పుట్టు కొస్తూనే ఉన్నారు. ఎంత కాలం ఇలా?.. అవినీతి అంతకంతకూ పెరుగుతూ పోతుంటే సుపరిపాలన అన్నది గగనకుసుమమే కదా!.. అన్నది విజ్ఞులైన ప్రజా పాలకులకు అవగతమవుతుంది. అందుకే, రాష్ట్ర ముఖ్యమంత్రి..యువనేత వైయస్ జగన్ ఈ అవినీతి భరతం పట్టేందుకు సంకల్పించాడు. అంతటా అవినీతి వేళ్లూనుకున్న నేటి సమాజంలో దానిని కూకటివేళ్లతో సహా పెకలించాలనే దృఢ సంకల్పం కలగడమే గొప్ప విషయం. అంతటి బృహత్కార్యానికి ఎవరు సమాయత్తమైనా అది నిజంగా ఆహ్వానించదగ్గ పరిణామమే. కానీ, అవినీతి అంతటా విస్తరించి, డబ్బుకు లోకం దాసోహమై ఉన్న నేటి కాలంలో అవినీతిని రూపుమాపడం సాధ్యమా?..అది జరిగే పనేనా అనే సందేహాలు కూడా లేకపోలేదు. కానీ, అంతటి మహత్కార్యానికి ఎక్కడో ఒకచోట ప్రారంభం అంటూ జరగాలి కదా!... కొరడా ఝుళిపిస్తేనే అవినీతి రాకాసి భయపడుతుంది తప్ప, మంచిమాటలతో అది లొంగేది కాదు. అందుకే మరింత కఠిన చట్టాలు అవసరమవుతున్నాయి.

ఇప్పటి దాకా ఉన్న ఆ లోటును గమనించిన ముఖ్యమంత్రి జగన్ తమ ప్రభుత్వంలో ఎలాంటి అవినీతి లేకుండా పారదర్శకంగా ఉండాలని, జవాబుదారీతనం లోపించకూడదని, పారదర్శకత, నిబద్ధతలకు పెద్దపీట వేయాలని, అలాంటి అవినీతి రహిత వ్యవస్థ కోసం అధికారులంతా తప్పనిసరిగా కృషిచేయాలని ఆశిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి కారణంగా ప్రజల సమస్యలు పరిష్కారంలో అలసత్వం పెరుగుతోందని, ఇకనుంచీ అలాంటివేమీ కుదరవని, అవినీతిపరులకు శిక్షలు తప్పవని హెచ్చరిస్తూ అవినీతి నిరోధానికి అవినీతి నిరోధకశాఖ అధికారులు మరింత చురుగ్గా పనిచేయాలని కూడా ముఖ్యమంత్రి సూచించడం రాష్ట్రానికి శుభపరిణామం.

## 'దిశ' తరహాలో ప్రత్యేక చట్టం...

అవినీతికి ఆస్కారం లేని విధానాలతో ముందుకు సాగాలనే లక్ష్యంతో వైయస్ జగన్ 'దిశ' తరహాలో ఒక కొత్త బిల్లును రూపొందించి అవినీతిపరుల ఆటకట్టించాలని భావిస్తున్నారు. గుడ్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి జగన్‌కు అహ్మదాబాద్ ఐఐఎం ప్రొఫెసర్ సుందరవల్లి నారాయణ స్వామి తాజాగా నివేదికను అందజేసిన ఈ సందర్భంలో సిఎం మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతిని సహించేదిలేదని, కూకటివేళ్లతో సహా అవినీతిని పెకలించాల్సిందేనని స్పష్టం చేశారు. లంచం తీసుకుంటూ నేరుగా పట్టుబడిన వారిపై నిర్దిష్ట సమయంలో చర్యలు తీసుకునేందుకు 'దిశ' తరహాలో ప్రత్యేక చట్టం ప్రవేశపెడతామని, అందుకు బిల్లును రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

కొన్ని అవినీతి కేసుల్లో విచారణ పాతికేళ్ళుగా సాగుతోందని, ఇదే పరిస్థితి కొనసాగితే అవినీతిని అరికట్టడంలో మనం సీరియస్‌గా లేమనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్తాయని అన్నారు. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడినవారిపై సకాలంలో చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులకు సాక్ష్యాలు సమర్పిస్తే శిక్షలు కూడా సకాలంలో పడతాయన్నారు. అందుకు 'దిశ' తరహాలో అత్యంత తక్కువ కాలంలోనే శిక్షలు పడేలా అవసరమైతే చట్టాన్ని సవరించాలన్నారు.

## లంచం తీసుకుంటే జైలే :

లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడితే ఇక ఉద్యోగం ఊడినట్లే. అంతే కాదు, జైలుకు వెళ్లి ఊచలు లెక్కపెట్టక తప్పదు. లంచావతారాలపై వేటు వేసేందుకు ప్రభుత్వం మరింత కఠినతరమైన చట్టాన్ని రూపొందించేందుకు కూడా సమాయత్తం కావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి నుంచి కూడా అవినీతిపై వచ్చే ఫిర్యాదులను స్వీకరించాలని, వాటిపై తగు చర్యలు తీసుకునేందుకు పటిష్టమైన విభాగాలు ఉండాలని, కలెక్టర్ కార్యాలయాలను కూడా వీటికి అనుసంధానించాలని ముఖ్యమంత్రి సూచించారు.

ప్రధానంగా మునిసిపల్, పట్టణ ప్రణాళిక విభాగాలు, సబ్ రిజిస్ట్రార్, తహశీల్దార్, ఎంపిడిఓ కార్యాలయాలను యూనిట్‌గా తీసుకుని సిబ్బంది విధులు, బాధ్యతల్లో స్పష్టత ఇవ్వడంతో పాటు అవినీతికి ఆస్కారం ఉన్న అంశాలను గుర్తించి వాటిని నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## అవినీతిని రూపు మాపడంపై అందరూ దృష్టి సారించాలి

అవినీతిని రూపుమాపడంపై అందరూ దృష్టి సారించాలని, అవినీతిపై ఫిర్యాదులు స్వీక రించేందుకు ఏర్పాటుచేసిన 14400 నెంబరుపై మరింత ప్రచారం జరగాలని, అవినీతికి పాల్పడాలంటే భయపడే పరిస్థితి రావాలని అన్నారు. అవినీతిని నిర్మూలించేందుకు అధికార యంత్రాంగమంతా సమాయత్తం కావాలన్నారు. టెండర్ల విలువ కోటి రూపాయలు దాటితే రివర్స్ టెండరింగ్‌కు వెళ్ళాలని, టిటిడితో సహ అందరూ ఈ సూచనలు పాటించాలని, ప్రతి ప్రభుత్వ విభాగంలోనూ రివర్స్ టెండరింగ్ నిర్వహించాలని చెప్పారు.

ఏదేమైనా అవినీతి నిరోధానికి ప్రభుత్వం నుంచి మరింత గట్టి సంకల్పం తోడు కావడంతో అవినీతిపరుల గుండెల్లో గుబులు రేగుతోంది.

# కరోనా కేసులు జిల్లాలో పాతికవేలు దాటాయి

- ఒక్కరోజులోనే 1168 మందికి కోవిడ్
- 315కు చేరిన మరణాల సంఖ్య

జిల్లాలో కరోనా రాకాసి కరాళనృత్యం చేస్తూనే ఉంది. రోజురోజుకీ కోవిడ్ వైరస్ బారిన పడేవారి సంఖ్య వందల్లోంచి దాటి వేయిని కూడా మించిపోతోంది. ఇప్పటికే కరోనా కేసుల సంఖ్య పాతికవేలు దాటిపోయింది. జిల్లాలో తొలి పాజిటివ్ కేసు నమోదయ్యాక అత్యధికంగా ఈనెల 26న ఒక్కరోజే 1168 మంది ఈ వ్యాధి బారిన పడ్డారంటే ఈ వ్యాధి ఎంతగా విజృంభిస్తోందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా అధికారయంత్రాంగం, వైద్యులు, సిబ్బంది అందరూ రేయింబవళ్ళు కరోనా కట్టడికి పెద్దఎత్తున చర్యలు తీసుకుంటూనే ఉన్నా వైరస్ మాత్రం నానాటికీ పెరిగిపోతూనే ఉంది. బుధవారం(ఈనెల 26) నాటికి జిల్లాలో కరోనా బాధితుల సంఖ్య 25,659కి చేరింది. 5960 మంది బాధితులు నెల్లూరు నగరంలోని వివిధ ఆసుపత్రుల్లోను, హోం ఐసొలేషన్లలోనూ చికిత్సలు పొందుతున్నారు. వ్యాధి తీవ్రమవుతున్న నేపథ్యంలో వైద్యులు, వైద్యసిబ్బంది అందరూ ప్రాణాలకు తెగించి బాధితుల ప్రాణాలను రక్షించేందుకు కృషిచేస్తూనే ఉన్నారు. ప్రస్తుతం జిల్లాలో 5960 యాక్టివ్ కేసులు నమోదై ఉన్నాయి. నెల్లూరులోని పెద్దాసుపత్రి, నారాయణ కోవిడ్ హాస్పిటల్, జిల్లాలోని ఇతర కోవిడ్ సెంటర్లలోనూ వీరందరికీ మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నారు. కరోనా వ్యాధి బారి నుంచి కోలుకున్న వారు కూడా పెద్దసంఖ్యలోనే ఉన్నారు. బుధవారం ఒక్కరోజే 657 మంది ఈ వ్యాధి నుంచి కోలుకుని డిశ్చార్జి కావడం, ఇప్పటిదాకా ఈ వ్యాధి నుంచి 19,384 మంది కోలుకోవడం సంతోషకరం.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు










జననం: 01.07.1930 మరణం: 03.09.2016

## చతుర్థ వర్ధంతి

ప్రముఖ న్యాయవాది, మా ఇంటి దైవం

### గునుపాటి ఆదిశేషారెడ్డి గారు

పరమపదించి తేది.03.09.2020కి
నాలుగేళ్ళు గడవనున్న సందర్భంగా

ఆ పుణ్యమూర్తిని స్మరిస్తూ...
వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు - కోడళ్ళు
గునుపాటి శ్రీనివాసులురెడ్డి - సింధు
గునుపాటి మురళీకృష్ణారెడ్డి - ప్రతిమ

కుమార్తెలు - అల్లుళ్ళు
ఉప్పల విజయలక్ష్మి - సుదర్శన్‌రెడ్డి
లేట్ పెనుబోలు పద్మజ - చంద్రశేఖర్‌రెడ్డి
పోలకూరు మాధవి - పద్మాకర్‌రెడ్డి

మనుమలు, మనుమరాళ్ళు
మునిమనుమలు - మునిమనుమరాళ్ళు
మరియు
ఇతర కుటుంబసభ్యులు

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, e-mail: roopagroup@yahoo.com